ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 25 | సంచిక : 7 | మార్చి 2020

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

21-12-2007, అత్తిలి

అరుణాచల మహత్యం

శ్రీమద్భగవద్గీత

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## ఉగాది

అనంతమైన కాల ప్రవాహంలో, మరొక నూతన తెలుగు సంవత్సరం 'శార్వరి'కి ఆహ్వానం పలకబోతున్నాం! ఒక్కసారి నిదానించి, కాలగమనం గుర్తుచేసుకోవలసిన రోజు. కాలము పరమాత్మ స్వరూపమే! పరమాత్మచే ప్రసాదింపబడిన ఈ మానవ శరీరము ధరించి యున్న జీవితము కాల రూపములో ఉంది కాబట్టి, అట్టి కాలాన్ని ఉపయోగించుకొని, స్వరూప అమృతస్థితిలోకి మేల్కోవాలి. ఎలాగు ఒక కాలములో ఈ శరీరం పుట్టింది కాబట్టి, ఈ పుట్టుక యొక్క ప్రయోజనం తిరిగి పుట్టకుండా ఉండడమే! కాలమునకు లోబడియున్న దేహేంద్రియమనోబుద్ధులను ఉపయోగించుకొని, కాలాతీత ఉనికిలోకి మేల్కోవాలి. జన్మ సాఫల్యానికి త్రికరణాలను, జాగరూకతతో ఉపయోగించుకోవాలి. మన జీవిత విధానములో వివేకము, దయ, కరుణ, సానుభూతి అవిభాజ్యమైనవిగా కలిసిపోవాలి. జీవితంలో మనము ప్రతిక్షణము చైతన్యవంతులుగా శోభించాలంటే, పరమాత్మ చింతన నదీప్రవాహము మాదిరి నిరంతరం కొనసాగుతూ ఉండాలి. జీవితం ఒక వ్యాపారము కాదు, జీవితాన్ని జీవించాలి. మన ఆంతరంగిక జీవితం సుసంపన్నంగా ఉండాలి. తలంపు, మాట, చేత ఒకటిగా ఉండాలి. తలంచేది ఒకటి, చేసేది మరొకటి అయితే, ఏమీ సాధించలేము. మనకు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలని కోరిక ఉంది కాని, గడపదాటి కాలు బయట పెట్టలేకపోతున్నాం! ఉత్తమ లక్ష్యాన్ని, ఉత్తమ మార్గాల ద్వారా సాధించడమే, వివేకవంతుల లక్షణం.

నూతన సంవత్సరములో అందరూ సుఖంగా, శాంతిగా ఉండాలని కోరుకుంటాం! నిజముగా మనము శాంతిగా, సుఖంగా, ఉండాలంటే ఈ దేహము జీవించి యుండగానే, దేహాత్మబుద్ధి నుండి విడుదలపొంది, సత్యాన్ని 'తాను'గా, 'నేను'గా అనుభవైకవేద్యం చేసుకోవాలి.

**ఓం తత్ సత్**

(ది॥ 25-03-2020 ఉగాది పర్వదినం సందర్భముగా)

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**మీ చందా గడువు ముగిసినది. కావున చందాను పునరుద్ధరించుకోగలరు.**

భక్తుల కోరికపై సద్గురువు శ్రీ నాన్నగారి భోదామృతం ఇంకా వివరంగా అందివ్వాలనే ఉద్దేశంతో **రమణభాస్కర** మాసపత్రిక సెప్టెంబరు సంచిక నుండి మార్పులు చేయబడినది. దీనికి భక్తుల నుండి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తున్నాము. పత్రికకు సంవత్సర చందా కట్టడంలో భక్తులు ఇబ్బందులు చెపుతున్నందు వలన ఇప్పటినుండి **శాశ్వతచందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లుగా నిర్ణయించడమైనది. భక్తులందరూ ఈ అవకాశమును ఉపయోగించుకొని రమణభాస్కర మాస పత్రికకు శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**శాశ్వత చందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లు

**సంవత్సర చందా** రు॥ **150**/-లు

మీ చందాను స్వయముగా గానీ, లేదా శ్రీ రమణ క్షేత్రం, కార్పొరేషన్ బ్యాంక్ అకౌంట్ నెం. 520101264185724 (IFSC Code : CORP0001613) నందు గాని చెల్లించగలరు. చందాను బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసినవారు జమ చేసిన తేదీ, వారి పూర్తి అడ్రసు 8883147999కు తెలియపరచగలరు.

## ముఖ్య గమనిక

రమణ భాస్కర పత్రిక ప్రతీ నెల 5వ తేదీన పోస్టు చేయటం జరుగుతోంది. పత్రిక 12వ తేదీలోపు మీకు అందని యెడల ఈ క్రింది సెల్ నెంబరుకు ఫోన్ చేసి మీ రశీదు నెంబరు తెలియబరచిన యెడల పత్రిక మరల పోస్టు చేయబడును. కావున భక్తులు గమనించగలరు.

సెల్ : **8883147999**

# ఉగాది

ఉగాది అంటే నూతన సంవత్సరం, సంవత్సరాది అని కూడా అంటారు. ఈ రోజు చైత్ర పాడ్యమి, బహుపవిత్రమైన రోజు. ఉగాది పండుగ గురించి నాన్నగారి మాటలలో..

సంవత్సరాది రోజున ఒకళ్ళ క్షేమం ఒకళ్ళు కోరుకుంటారు. అందరి క్షేమం మనం కోరుకోవాలి. అందరి క్షేమం మనం కోరుకుంటే మనం క్షేమంగా ఉంటాము. అందరూ శాంతిగా ఉండాలి అనుకుంటే మనం శాంతిగా ఉంటాము. అంతే కాని ఎవళ్ళూ శాంతిగా సుఖంగా ఉండకూడదు, నేనే శాంతిగా ఉండాలి, నేను ఒక్కడినే సుఖంగా ఉండాలి అనుకుంటే కోటిజన్మలు ఎత్తినా నాకు సుఖం దొరకదు. నాకు కోట్లకొలదీ డబ్బు ఉన్నా కూడా నాకు సుఖం దొరకదు. రమణమహర్షిగారు అనేవారు, మనిషి సుఖం కోరుకోవటంలో పొరపాటు లేదు. కాని ఆ సుఖం ఎక్కడుందో వాడికి తెలియటం లేదు. సుఖంకోసం బజారులోని, ప్రకృతిలోని, ప్రపంచంలోని వెతుక్కొంటున్నాడు. కాని సుఖం తన హృదయంలోనే ఉంది. తన హృదయంలోనే సుఖం ఉంది అన్న సంగతి మరిచిపోయి ప్రపంచంలో వెతుక్కొంటున్నాడు. నాకు ఏదైనా సుఖం ఉంటే, శాంతి ఉంటే, లోపల ఏదైనా ఆనందముంటే, అది మీకు పంచిపెట్టగలను కాని నాకే లేకపోతే మీకు ఏమి ఇవ్వగలను?

ఉగాది రోజు అందరూ తలంటి నీళ్ళు పోసుకుంటారు. చాలా మంది కొత్తబట్టలు కట్టుకుంటారు. ఈ రోజున సాయంత్రం అందరూ పంచాగం వింటారు. అందులో వారం, తిది, నక్షత్రం, యోగం, కరణం గురించి చెపుతారు, ఈ పంచ అంగాలతో కూడినదే పంచాంగం. సాంప్రదాయం ఏమిటంటే, పంచాంగం ఈ రోజున ఎవరైతే శ్రవణం చేసారో, వాళ్ళకి నవగ్రహాల అనుగ్రహం ఉంటుందని ఒక సాంప్రదాయం. సంవత్సరాది రోజున ఉదయం వేపపువ్వు పచ్చడి తింటారు. వేపపువ్వు పచ్చడి కొంచెం చేదుగా ఉంటుంది, కొంచెం తియ్యగా ఉంటుంది. ఆ చేదు కష్టం, ఆ తీపి సుఖం. జీవితంలో ఇవి రెండూ వస్తాయి, అవి అనుభవించటం నేర్చుకోవాలి. జీవితం అన్నాక కష్టం ఉంటుంది, సుఖం ఉంటుంది. అవన్నీ బాలన్స్ చేసుకో, అందుకే కొంచెం చేదు కొంచెం తీపి రెండూ ఉంటాయి వేపపువ్వు పచ్చడిలో, అంటే కష్టసుఖాల మిశ్రమమే జీవితం. అవి రెండూ బాలన్స్ చేసుకోమనటం కోసం, మన చేత వేపపువ్వు పచ్చడి తినిపించటం అందుకే.

ఏ కారణం చేత అయినా మీకు దుఃఖప్రారబ్ధం ఉన్నా, అందులో మంచి కూడా ఉంది. ఆ దుఃఖ ప్రారబ్ధం మీకు అనుభవంలోకి రావటం వల్ల, మీకు జ్ఞానబుద్ధి, ధర్మబుద్ధి, ఆత్మబుద్ధి కలగవచ్చు. అంచేత మీరు తొందరపడి భగవంతుడిని తిట్టవద్దు. దుఃఖప్రారబ్ధం కూడా మిమ్మల్ని అనుగ్రహించటానికే అని మీరు మరిచిపోకండి. రూపబుద్ధి లేనివాడిని, నామబుద్ధి లేనివాడిని ప్రారబ్ధం ఏమి చేస్తుంది, కాలి బూడిద అయ్యిపోతుంది.

నువ్వు కళ్ళు మూసుకోనక్కరలేదు చెవులు మూసుకోనక్కరలేదు. ప్రకృతిని చూడు, ప్రపంచాన్ని చూడు, లోకంలో జరిగే సంఘటనలని ప్రశాంతంగా చూడు, వాటిలో నుండి

పాఠాలు నేర్చుకొని బాగుపడు. లోకానికి సంబంధించిన ద్వంద్వాలు ఏది వచ్చినా, శీతోష్ణాలు వచ్చినా సుఖదు:ఖాలు వచ్చినా, రాగద్వేషాలు వచ్చినా, సాత్త్వికంగా ప్రతిఘటన లేకుండా ఎదుర్కో, చిరునవ్వుతో ఎదుర్కో. నిన్ను కొందరు పొగడవచ్చు, కొందరు విమర్శించవచ్చు. రియాక్షన్ లేకుండా పరిశీలన చెయ్యటం నువ్వు నేర్చుకుంటే, నువ్వు జీవితంలో నుంచి పాఠాలు నేర్చుకుంటావు, నీకు సాత్వికబుద్ధి పెరుగుతుంది, సాత్వికబుద్ధి వల్ల వివేకం వైరాగ్యం పెరుగుతుంది. వివేక వైరాగ్యాలు నీ హృదయంలోని నిజమైన ఇంటికి తీసుకొనిపోతాయి; నీకు బ్రహ్మానుభవం కలుగచేస్తాయి. లోకం అన్నాక ఏదో ఒకటి జరుగుతూ ఉంటుంది, ఇది కుక్కతోక లాంటిది. ఆ సంఘటనలని మనుషులని పరిశీలన చేసేటప్పుడు ప్రతిఘటన వద్దు, ప్రతిస్పందన వద్దు, సాత్వికబుద్ధితోటి పరిశీలన చెయ్యి. కళ్ళతోటి చూడు, ఆ మాటలు విను, కాని సాత్వికంగా చెయ్యి. ఈ క్రియేషన్ని సాత్వికబుద్ధి తోటి అబ్జర్వ్ చెయ్యటం నేర్చుకుంటే, నువ్వు క్రియేటర్ దగ్గరికి వెళ్లిపోతావు. అంటే ఈ సృష్టికి ఎవడైతే యజమానో, వాడి పాదాల దగ్గరికి వెళ్ళి చేరుకుంటావు.

మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు, కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. డబ్బు పోతే సంపాదించుకోవచ్చు కాని కాలం పోతే తిరిగి సంపాదించుకోలేము. ప్రతి నిమిషం, ప్రతి క్షణం జాగ్రత్తగా ఉండండి. భగవంతుడు గీతలో నేను కాలరూపంలో ఉన్నాను అని చెప్పాడు. డోంట్ వేస్ట్ యువర్ టైం అండ్ ఎనర్జీ! ప్రతి క్షణం సద్వినియోగం చేసుకోండి. మీకందరికీ జ్ఞానం కలుగుతుంది, అందులో సందేహం లేదు. అనుమానం పెట్టుకోవద్దు. మీరందరూ జీవన్ముక్తులు అవుతారు. ప్రస్తుతం మీరేదైనా దు:ఖం అనుభవిస్తున్నా అది సుఖంగా మారిపోతుంది. మీ మైనస్ పాయింట్లు అన్నీ ప్లస్ లోకి వచ్చేస్తాయి. మీ నష్టాలు అన్నీ కూడా లాభాల కింద మారిపోతాయి.

బయట ఏమీ లేదు, అంతా హృదయం లోనే ఉంది. మనం పొందవలసింది హృదయంలోనే ఉంది. అంతర్ముఖుడు కాని వాడికి ఆత్మజ్ఞానం కలగదు. భౌతికంగా అభివృద్ధిలోకి రావాలన్నా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావాలన్నా, మీరు అంతర్ముఖులు అవ్వాలి. అంతర్ముఖం అయితేనే మీకు భౌతికం ఆధ్యాత్మికం రెండూ కలిసి వస్తాయి. అంతర్ముఖుడు కాని వాడికి ఈ లోకం లేదు, పరలోకం లేదు.

మీరందరూ జీవన్ముక్తులు అవ్వాలి, మీరందరూ గుణాతీతులు అవ్వాలి, మీరందరూ ఆత్మసామ్రాజ్యానికి అధిపతులు అవ్వాలి, మీరందరూ ఆత్మసుఖాన్ని సొంతం చేసుకోవాలి, మీరు భౌతికంగా ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావాలి, ఎవరి ముఖం చూసినా ఆనందంతోటి తొణికిసలాడాలి! నూతన సంవత్సరంలో మీ ఆలోచనలు, మీ మాటలు, మీ తలంపులు, ఏది చేసినా మంచికే చెయ్యండి. ఒక మాట మాట్లాడితే మంచికే మాట్లాడండి, ఒక సంకల్పం వస్తే మంచికే చెయ్యండి. అలా జీవిస్తూ ఉంటే జ్ఞానం వచ్చి మిమ్మల్ని వరిస్తుంది.



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 16 డిసెంబర్ 1984, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవంతుడు పురుషోత్తమ ప్రాప్తి యోగం అని భగవద్గీతలో చెప్పాడు. పురుషుడు అంటే స్వరూపమని అర్థం. అంటే మన స్వరూపాన్ని మనం తెలుసుకోవడం పొందడం పురుషోత్తమ ప్రాప్తి. ఆత్మ అన్నా, పురుషోత్తముడు అన్నా, పరమాత్మ అన్నా, మోక్షం అన్నా, అన్నీ ఒక్కటే. భగవంతుడిని తెలుసుకున్నారు అంటే, ఆత్మని తెలుసుకున్నారు అని అర్థం. భక్తుడు భగవంతుడు అంటాడు. జ్ఞాని ఆత్మ అంటాడు. ఆత్మ ప్రాప్తి అన్నా, పురుషోత్తమ ప్రాప్తి అన్నా, స్వరూప ప్రాప్తి అన్నా ఒకటే. అది మనకి భిన్నంగా లేదు, మన స్వరూపంగానే ఉంది. మనం ఆత్మ గానే ఉన్నాం, ఆత్మకి వేరుగా లేము. అయితే మన ప్రయత్నం దేనికి?

మనం ఆత్మే అయ్యి ఉన్నాము కదా, అది సుఖస్వరూపం కదా, మనకెందుకు ఆ వస్తువు తెలియటం లేదు? అది మన హృదయంలో ప్రకాశిస్తోంది, అది ఎప్పుడూ ఉంది, ఎల్లకాలం ఉంది. ఈ దేహానికి, లోపలఉన్న స్వరూపానికి కించిత్తు కూడా సంబంధం ఏమీ లేదు. అది మనం అయ్యి ఉన్నాము, అయితే ఆ వస్తువు మనకి ఎందుకు తెలియటం లేదంటే, మన అలవాట్లు వల్ల. అందరూ దేవుణ్ణి తెలుసుకోవాలి, ఆత్మని తెలుసుకోవాలి అంటారు. మనం తెలుసుకోవాలి అనుకున్నప్పుడు కూడా మనం ఆత్మ స్వరూపమే, మనకి తెలియదనుకున్నప్పుడు కూడా ఆత్మ స్వరూపమే, ఇప్పుడు ఆత్మ అయ్యే ఉన్నాం మనం అందరం. కొత్తగా మనం తెలుసుకునేది ఏమిటి? ఇందులో ఏమీ లేదు. విషయం అనుభవంలో లేకుండా మాట్లాడితే నేను కంగారు పడటం, మిమ్మల్ని కంగారు పెట్టటం. అసలు విషయం చెప్పే వారికి అది ఎంతోకొంత అనుభవంలో ఉండాలి. నాకు అనుభవం లేదు అనుకోండి, మిమ్మల్ని కంగారు పెడతాను. అయితే మనకున్న అలవాట్లు దానిని అనుభవం లేకుండా చేస్తున్నాయి. ఈ అలవాట్లని వేదాంత పరిభాషలో సంస్కారాలు అంటారు, వాసనలు అంటారు, మన అలవాట్లు మన స్వరూపాన్ని తెలుసుకోకుండా మనకి అడ్డుపడుతున్నాయి.

ఆచార్యుల వారు నీతి హీనులతో స్నేహం చేయొద్దని మనకి బోధించారు. ఎందుచేత

అంటే సహవాసం వల్ల కూడా మనకి చెడు అలవాట్లు వస్తాయి. బెల్లం ఉన్న చోటకి ఏ విధంగా అయితే ఈగలు వెళతాయో, మనలో ఎక్కువ స్వార్ధం ఉన్నప్పుడు తన స్వార్ధ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం మనిషి దుష్టసహవాసం విడిచి పెట్టడు. ఎదుటివారు ఎంత దుష్టుడు అయినప్పటికీ తన స్వార్ధానికి వాడు ఉపయోగపడుతుంటే, వారి సహవాసం విడిచి పెట్టడు. దుష్ట జనుల సహవాసం విడిచిపెట్టమన్నారు కానీ విడిచి పెట్టలేరు. ఫలానా వాడు దుష్టుడు అని మీకు తెలుసు, కానీ వాడి సహవాసం చేస్తుంటారు, వాడికి సేవ చేస్తుంటారు. ఎందుకంటే, లోపల కొంచెం స్వార్ధం ఉంది. వాడి వల్ల కొన్ని పనులు అవ్వవలసి ఉన్నాయి కాబట్టి, తన జ్ఞానాన్ని ఈ స్వార్ధం కోసం బలి చేసేస్తాడు. అందుచేత ఆచార్యుల వారు నీతిహీనుల స్నేహం చేసేవారు కుక్కల తోటి సమానం అని చెప్పారు. అంత కఠినమైన భాషలో ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, ఈ దేహం పడిపోయినప్పుడు, ఈ దేహం కాలిపోయినప్పుడు, మన అలవాట్లు పడవు, మన అలవాట్లు కాలవు. ఇది బాగా జ్ఞాపకం ఉంచుకోండి. ఇపుడు ఈ దేహం తోటి కొన్ని అలవాట్లు చేసుకుంటున్నారు. అవి మంచి అలవాట్లు అవ్వచ్చు, చెడ్డ అలవాట్లు అవ్వచ్చు. దేహం పడిపోయినపుడు ఈ మంచి అలవాట్లు పడిపోవు, ఈ చెడ్డ అలవాట్లు పడిపోవు. దేహానికి చావు ఉంది కానీ, అలవాటుకి చావు లేదు. అందుచేత మీరు ఆరోగ్యంగా ఉన్నారు కదా, మీ మాటలు అన్నీ నెరవేరుతున్నాయి కదా, మీకేదో సాగుబడి ఉంది కదా అని , మీకున్న చదువుని ధనాన్ని మీ స్వార్ధం కోసం నిరంతరం ఉపయోగించుకుంటే, మీ చెడ్డ అలవాట్లు కనుక పెంచుకుంటే, నీతి హీనుల స్నేహం గనుక చేస్తే దాని వల్ల వచ్చే అలవాట్లు శ్మశానంలో కాలవు, దేహం కాలినప్పుడు అవి కాలవు. అవే మీ కొంప ముంచుతాయి. రాబోయే జన్మలలో మిమ్మల్ని పట్టుకుని పీడించేస్తాయి. అందుచేత స్నేహల విషయంలో బహు జాగ్రత్తగా ఉండమని ఆచార్యుల వారు గట్టిగా చెప్పారు. మనం ఏ పని చేసినా, మంచి చేసినా, చెడ్డ చేసినా, కర్తృత్వము పెట్టుకుని చేస్తున్నాము. నేను చేస్తున్నాను అనే భావన. ఈ నేను అనే భావనే మనకి దుఃఖం తీసుకువస్తుంది. మనం పని చేయాలి, ఫలితం గురించి మర్చిపోవాలి. మనం ఫలితం గురించి మర్చిపోయినా దాని ఫలితం వస్తూ ఉంటుంది. అది ఈశ్వరుడి యొక్క పని, ఈశ్వరుడు చేస్తాడు.

మనకి ఏదైనా కలిసి వస్తుందంటేనే పని చేస్తాము. మన జీవితానుభవంలో మనకి ఏదైనా కలిసి వస్తుందంటేనే ఎదుటి మనిషి తోటి మాట్లాడతాము, కలిసి వస్తుందంటే పని చేస్తాము. కలిసి రాదు అనుకుంటే ఎదుటి మనిషిని చూసి చిన్న నవ్వు కూడా నవ్వము. వాడి వల్ల మనకి ఏమీ కలిసిరానప్పుడు ఆ చిరునవ్వు ఖర్చు కూడా ఎందుకు అని! మనం పని చెయ్యాలి, స్వార్ధం ఉండకూడదు అని చెప్పారు తిలక్ గారు. కానీ మనం స్వార్ధం తోటి చేస్తున్నాం. దీనిని మీ అనుభవంలో కూడా చూడండి.

కొంతమంది ఏమంటారంటే నేను వాళ్ళకి చాలా ఉపకారం చేశానండీ కానీ వాళ్లకేమీ కృతజ్ఞత లేదండీ అంటారు. కృతజ్ఞత గురించి శాస్త్రంలో ఏమి చెప్పారంటే, ఎదుటి వారు మనకి చేసిన ఉపకారాన్ని జ్ఞాపకం ఉంచుకోమన్నారు, అపకారం చేస్తే మర్చిపోమన్నారు. కానీ మన అనుభవంలో ఏమిటంటే, వాడు కొట్టాడు, వీడు తిట్టాడు, వాడు ఫలానా రోజున

ఏదో అన్నాడు ఈ గొడవలనే మననం చేసుకుంటాము. దాని వల్ల మనకి కోపం వస్తుంది. అంటే ఏమిటి? ఎవరైతే మిమ్మల్ని తిట్టారో, ఎవరైతే కొట్టారో, ఎవరైతే మిమ్మల్ని దూషించారో, ఎవరైతే మిమ్మల్ని ద్వేషించారో, వారి నామరుపాల్ని అస్తమాను మీ మనసులో జ్ఞాపకం పెట్టుకుంటారు. అలా చింతించటం వల్ల నీలో కూడా ద్వేషం పెరుగుతూ ఉంటుంది, కక్ష పెరుగుతూ ఉంటుంది. అందుచేత భగవంతుడు వాసుదేవ స్వామి ఇక్కడ నీకు స్వార్థం ఉండకూడదు, పని చెయ్యమని చెబుతున్నాడు.

ఇక్కడ ఒకటి జ్ఞాపకం ఉంచుకోవాలి, మీరు ఫలితం ఆశించకపోయినా, మీరు చేసిన పనికి ఫలితం వచ్చేస్తుంది. మీరు కోరితే వచ్చిన ఫలితం మిమ్మల్ని బంధిస్తుంది, మీరు కోరకుండా వచ్చిన ఫలితం మిమ్మల్ని బంధించదు. ఇది బాగా అర్థం చేసుకోండి. భగవంతుడు కృతజ్ఞుడు, భగవంతుడు కృతఘ్నుడు కాదు. మీరు ఎంత పని చేస్తే అంత పనికి తిరిగి ఉపకారం భగవంతుడు చేసేస్తాడు. ఎందుచేత అంటే ఆయన కృతజ్ఞుడు. ఎదుటివాడు చేసిన ఉపకారాన్ని, వెంటనే మరచిపోయే స్వభావం కలవాడు కృతఘ్నుడు. కొంతమంది ఎదుటివాడి దగ్గర ఉపకారం పొందుతారు, అది వెంటనే మర్చిపోతూ ఉంటారు. అటువంటి వారు చచ్చిపోయినపుడు వారి శరీరాన్ని తీసుకెళ్ళి కాల్చకుండా, శ్మశానంలో పడేస్తే, ఆ మాంసాన్ని తినడానికి జంతువులు కూడా అసహ్యించుకుంటాయి అని వాల్మీకి మహర్షి రామాయణంలో చెప్పారు. అయితే మనం స్వార్థం పెట్టుకోకుండా పని చేస్తే మనకి ఫలితం రాదేమో అని అనుకుంటున్నారు. మీరు స్వార్థం లేకుండా పని చేయండి, మీరు ఊహించినదాని కంటే ఎక్కువ ఫలితాన్ని భగవంతుడు మీకు ఇస్తాడు.

మనం చాలా ఓర్పుగా, జాగ్రత్తగా ఉంటే ఈ అలవాట్లని బయటకి గెంటుకోవచ్చు. దీనికి సత్వగుణం చాలా ముఖ్యం. సత్వగుణం జ్ఞానానికి దారి చూపిస్తుంది. మన మనస్సు ఒక గంట ఒకరకంగా, ఇంకో గంట ఒకరకంగా ఉంటుంది. దానికి కారణం, మనలో ఉన్న గుణాలు అన్నీ మెదులుతున్నాయి. ఈ రజోగుణం, తమోగుణం, సత్వగుణం మెదులుతున్నాయి. ఆ మెదిలేటప్పుడు రజోగుణాన్ని, తమోగుణాన్ని నెమ్మదిగా అణచిపెట్టి, సత్వగుణాన్ని నెమ్మదిగా లోపల అభివృద్ధి చేసుకోవాలి. సత్వగుణం ఒకటే జ్ఞానానికి దారి తీస్తుంది. విచారణమార్గం అతి సులభం. కానీ మన మనసులో తగినటువంటి పవిత్రత లేక, మనస్సు శుద్ధి చేసుకోలేకపోవటం వల్ల కష్టంగా కనిపిస్తుంది. విచారణమార్గం చాలా తేలిక; దానినే ఎంక్వయిరీ మార్గం అంటారు. అది మీకు ఎంత తేలిక అంటే మీరు సాధనల పేరుమీద కష్టపడక్కరలేకుండా, విచారణతో వస్తువు లభ్యం అవుతుంది. ప్రాణాయామం చెయ్యటం తప్పని నేను అనటం లేదు, కాని అసలు అవేం అక్కర్లేదు. అయితే అది సూట్ అయ్యేవాడికి అది సూట్ అవుతుంది కాబట్టి అది కూడా ఒక మార్గంగా చెబుతారు.

వస్తువు ఇక్కడే ఉంది, మన హృదయంలో ప్రకాశిస్తోంది. అది మనకు అనుభవంలోనికి రాకుండా మన అలవాట్లు మనకి అడ్డు వస్తున్నాయి. ఈ అలవాట్లు మన జన్మ జన్మలనుండి అనేక దేహాల నుంచి వస్తున్నాయి. ఈ జన్మలో కొన్ని తలంపులు కనిపిస్తున్నాయి. కొన్ని వాసనలు కనిపిస్తున్నాయి. ఇంతే అని మీరు అనుకోవద్దు. ఇంకా దీని

అడుగుభాగంలో అడుగు పొరల్లో ఇంకా కొన్ని తలంపులు ఉంటాయి. మీకు విచారణ మార్గంలో, ఈ తలంపులు, ఈ వాసనలు అన్నీ కదిలి బయటకి వచ్చేస్తూ ఉంటాయి. అవి బయటకి తలంపురూపంలో వచ్చినప్పుడు గాని ఆ అలవాటు ఉందని కూడా మీకు తెలీదు. ఇప్పుడు మనకి కొన్ని తలంపులు కనిపిస్తున్నాయి. ఈ తలంపులే నాకు ఉన్నాయి మిగతా తలంపులు ఏమీ లేవని మీరు అనుకోకండి. ఈ తలంపులు నెరవేరాక, మిగతా తలంపులు మా మాట ఏమిటని బయటికి వస్తాయి. మీరొకటి జ్ఞాపకం ఉంచుకోండి, లోపల గనుక వాసన లేకపోతే తలంపు రానే రాదు. భూమిలో విత్తనం గనుక లేకపోతే, మొక్క రానే రాదు. మొక్క వచ్చిందంటే భూమిలో విత్తనం ఉందన్నమాట. అదే విధంగా మీకు ఏ తలంపైనా వచ్చిందంటే, లోపల వాసన ఉందన్నమాట. వాసన లేకపోతే తలంపు రావడానికి అవకాశం లేదు. ఈ తలంపులకి మూలం ఏమిటంటే, అహంకారం. తలంపులు ఎక్కడ నుంచి వస్తున్నాయి అంటే, అహంకారం నుండే వస్తున్నాయి మనిషికి. అందుచేత ఈ అహంకారమే సంసారం, ఈ అహంకారమే ప్రపంచం అన్నారు రమణస్వామి.

మన అందరికీ ప్రపంచం అంటే చాలా ఇష్టం. చచ్చిపోతాము అంటే మన అందరికీ భయం వేస్తుంది. కారణం ఏమిటంటే, ఈ ప్రపంచం మనకి కనపడదేమో, ఈ పాలకొల్లు కనపడదేమో అని. సినిమాలు చూసేవారికి మళ్ళీ సినిమాలు కనపడవేమో అని భయం. రోజూ కాఫీ హోటల్ కి వెళ్ళేవాడికి మళ్ళీ ఈ కాఫీ దొరకదేమో అని భయం. జత గాళ్ళు మనకి దొరుకుతారో, లేదో అని భయం. ఎవరి అలవాట్లు వారికి మనం చచ్చిపోతే ఇవన్నీ దొరకవేమో అని భయం. ఇదంతా ఏమవుతుంది, మన బంగారం మన వెండి ఏమవుతాయి, అనే కదా భయం! కానీ ఈ ప్రపంచానికి, మీకు ఉన్న సంబంధం ఏమిటి? మీరు ఎప్పుడైనా ఆలోచించారా? ఆవిడ మా అత్తగారండీ, ఈవిడ మా తోటి కోడలండి, ఆయన మా మామగారండి ఇలా వరుసలు చెబుతారు కదా మీరు. అసలు మీకు, ప్రపంచానికి ఉన్న సంబంధం ఏమిటి అని ఎప్పుడైనా ఆలోచించారా? ప్రపంచం మీకు ఏమి అవుతుంది? మీకు అత్తగారు అవుతుందా, తోటి కోడలు అవుతుందా? అసలు ప్రపంచాన్ని విడిచి పెట్టేస్తాము అంటే మనకి అందరికీ భయం వేస్తుంది.

చావు అంటే భయం ఎందుకంటే మళ్ళీ ఈ దేహం కనపడదు, ప్రపంచం కనపడదు. అజ్ఞానానికి మూల కారణాలు ఇవే, ఒకటి శరీరం, రెండు మనస్సు, మూడు ప్రపంచం, ఈ అజ్ఞానం అనే దుంప ఇక్కడి నుంచే ప్రారంభం అవుతుంది. శరీరంలోంచి, మనస్సులోంచి, ప్రపంచంలోంచి! ఇదొక కాంప్లెక్స్ అన్నమాట - ఒకటి శరీరం, రెండు మనస్సు, మూడు ప్రపంచం, మీకు ప్రపంచానికి సంబంధం ఏమిటి అసలు? మీకు ప్రపంచానికి ఉన్న చుట్టరికం ఏమిటి? స్నేహం ఏమిటి? మనం పుట్టక ముందు ఈ ప్రపంచంతో మనకు సంబంధం ఏముంది? మనం చచ్చిపోయిన తరువాత ఈ ప్రపంచంతో సంబంధం ఏముంటుంది? ఈ ఇరవై యేళ్ళు, ముప్పై యేళ్ళు, డబ్బై యేళ్ళు, ఎనబై యేళ్ళు ఉంటున్నాం కదా, ఈ శరీరం తోటి ప్రపంచాన్ని చూస్తున్నాం కదా, ఈ ప్రపంచానికి, మనకి ఏమి సంబంధం ఉందని ప్రాణం పోయేటపుడు మనకి భయం వేస్తుంది? ఈ ప్రశ్న ఎప్పుడైనా మీ మనసులో కలిగిందా?

మనలను చెడగొట్టేది ఏమిటంటే, విపరీతబుద్ధి! విపరీతబుద్ధికి లోపల ఆత్మ ఉందో లేదో ఎలా తెలుస్తుంది? విపరీతబుద్ధి ఉన్నవాడు, వక్రబుద్ధి ఉన్నవాడు లోపల ఆత్మ ఉందో లేదో చెప్పటానికి వాడు సమర్ధుడా? ఎంతో సద్బుద్ధి గలవాడికి, సత్వగుణం ఉన్నవాడికి, జీవితం అంతా కూడా సత్యాన్ని తెలుసుకోవడం కోసం వడపోత పోసినవాడికే అంతు దొరక్కపోతే; కేవలం, దుష్టమైన తలంపులు, దుష్టమైన అలవాట్లు, వక్ర బుద్ధులు, వంకర బుద్ధులు ఇటువంటివి ఉన్నవాడికి ఆత్మ ఎలా దర్శనం అవుతుంది? ఇది ఎవరబ్బగారి సొమ్ము? మహాత్మాగాంధీగారికి భగవద్గీత అంటే చాలా ప్రీతి. ఆయనేమన్నారంటే, ఈ భగవద్గీత అంటే నాకు చాలా ఇష్టం. ఒకవేళ ఇది పిచ్చి అని మీరు ఎవరైనా అనుకుంటే ఆ పిచ్చే నాకు తియ్యగా ఉందని అంటారు ఆయన. ఒకవేళ మీరు ఎవరైనా అనుకోవచ్చు, ఏంటి గాంధీగారికి భగవద్గీత అంటే ఇంత ఇష్టం కదా, ఆయనకి అంత పిచ్చి ఎందుకు అని. ఆ పిచ్చే నాకు మధురంగా ఉంది, ఒకవేళ మీరు పిచ్చి అనుకున్నప్పటికి ఆ పిచ్చే నాకు ఇష్టం అని చెప్పారు. ఇంతకంటే మంచి పిచ్చి లోకంలో ఇంకోటి చూపించండి పోనీ మీరు! జ్ఞానాన్ని తెలుసుకోవడం కూడా మీరు పిచ్చి అని అనుకుంటే, ఇంతకన్నా మంచి విషయం మీరు ఏదైనా చూపించండి. నేను చెప్పేది మీరు కాదన్నప్పుడు, ఇంకోటి ఏదో మంచిది చూపించగలగాలి. ఆల్టర్నేటివ్ చూపించకుండా గీతని విమర్శించడానికి అర్హత లేదు.

మీరు దుష్ట సహవాసాలు విడిచి పెట్టలేకపోవడానికి కారణం అమాయకం అనుకోకండి. ఆచార్యుల వంటివారు వందమంది వచ్చి చెప్పినా వాడు విడిచిపెట్టడు. కారణం ఏంటంటే వాడికి లోపల స్వార్ధం ఉంది. ఎదుటివాడు దుష్టుడు అవునా కాదా అని వీడు తెలియనంత మూర్ఖుడు కాదు, అవివేకి కాదు. లౌకికుడిలో కూడా చాలా తెలివి తేటలు ఉన్నాయి. లౌకికుల దగ్గర కుటిలత్వం ఎక్కువుంటుంది. ప్రతి లౌకికుడు కుటిలుడే. ప్రతి లౌకికుడు ఏమి చేస్తాడు? తన స్వార్ధం కోసం ఎంత నీచుడిని అయినా ఆశ్రయించి వాడితో పనులు చేసుకుంటాడు. వాడు మూలంలో నాశనం అయిపోతున్నాడనే విషయం వాడికి తెలియదు.

అందుచేత ఆచార్యుల వారు చెప్పేది ఏమిటంటే, నువ్వు నీ స్వార్ధం కోసం అయినప్పటికి నీచజనుల యొక్క స్నేహం చేయకూడదు, అది సాధకులకు పనికి రాదు అని చెప్పారు. మాయ పరమేశ్వరుడి చేతిలో ఉంది. మనం మాయ చేతిలో ఉన్నాం. అందుచేత పరమేశ్వరుడిని గనుక ఆశ్రయిస్తే మాయ నుండి మనం బయట పడతాము. భక్తిపరులం అవుతాము. మీకు భక్తి ప్రమాణం అని ఆచార్యుల వారు చెబుతున్నారు. ఈశ్వరుడి పాదాలను ఎందుకు ఆశ్రయించమని చెబుతున్నారు అంటే, కొంతమంది ఇవాళ భక్తిగా ఉంటారు, మళ్ళీ రేపు భక్తి తగ్గిపోతుంది. మీరు ఇప్పుడు ఇక్కడ కూర్చున్నారు కదా మీకు మాములుగా ఎప్పుడూ ఒకేలాగా భక్తి ఉంటుందా? మీరు అబద్ధం చెప్పకుండా నిజం చెప్పండి. ఒకొక్కసారి ఏమైనా సరే కష్టపడి మనం జ్ఞానాన్ని పొందాలి, భగవంతుని పాదాలను పొందాలి అనిపిస్తుంది. భగవంతుని పాదం అంటే ఆత్మే. మనకి మూలం ఆత్మే! మన మనస్సు ఎప్పుడూ ఒకేలాగా ఉండదు. భక్తిగా ఉండాలని కోరిక ఉంటుంది కానీ, ఆదివారం ఒకరకంగా, సోమవారం ఒకరకంగా, శుక్రవారం ఒకరకంగా ఉంటాము. దానికి కారణం ఏమిటి అని

మీరు ఎప్పుడైనా ఆలోచించారా? మీ అనుభవంలో చెప్పండి.

మీరు నన్ను మోసం చేయటం లేదు, నేను మిమ్మల్ని మోసం చేయటం లేదు. ఒకవేళ ఇది మోసం కింద కనిపించినప్పటికి, దీని ఎఫెక్టు ఎక్కువ దూరం ఉండదు. భౌతికంగా మీరు నన్ను మోసం చేస్తే, నేను భౌతికంగా నష్టపోతాను అంతే, నేను మిమ్మల్ని మోసం చేస్తే మీరు భౌతికంగా నష్టపోతారు అంతే. కానీ యధార్థం చెప్పాలంటే ప్రతీ వాడినీ కూడా తన మనసే తనని మోసం చేస్తుంది. నా అహంకారం నన్ను మోసం చేస్తుంది, మీ అహంకారం మిమ్మల్ని మోసం చేస్తుంది. ఈ రహస్యం మరచిపోయి ఎదుటివారు ఎవరో మనకు అపకారం చేసేస్తున్నారు. ఎదుటివారు మనలని మోసం చేసేస్తారు అని మనం అనుకుంటాం. నా అహంకారానికి ఉన్నన్ని యుక్తులు నక్కకి కూడా లేవు!

ప్రతి మనిషిని మోసం చేసేది పొరుగింటివారు కాదు, వాళ్ళ ఇంటిలో మనుషులు కాదు. వాడి అహంకారమే వాడిని నాశనం చేస్తుంది. వాడి అహంకారమే వాడిని మోసం చేస్తుంది, మోహంలో పెడుతుంది. అహంకారానికి ఉన్న ట్రిక్కులు ఎవరికి లేవు. వ్యవసాయదారుడిని మోసం చేస్తుంది, సైంటిస్టుని మోసం చేస్తుంది, డాక్టర్‌ని మోసం చేస్తుంది, ఇంజనీరుని మోసం చేస్తుంది. ఎవరు ఏ వృత్తిలో ఉన్నా కూడా వాడి అహంకారం వాడిని మోసం చేస్తుంది. చదువుకున్న వాడు కూడా మూర్ఖుడే వాడికి ఆత్మ తెలియకపోతే, చదువుకున్న మూర్ఖుడు, చదువులేని మూర్ఖుడు అంతే! మూర్ఖత్వం చదువు లేని వాడిలోనూ ఉంటుంది, చదువుకున్న వాడిలోనూ ఉంటుంది. కొన్ని కొన్నిసార్లు మనం చూస్తే చదువుకున్న వాడి కంటే చదువు లేని వాడి మనస్సే నిదానంగా ఉంటుంది. అది మీకు అనుభవంలో తెలుస్తుంది. అయితే ఏమిటి మన ప్రశ్న? నా అహంకారం నన్ను మోసం చేస్తుంది, మీ అహంకారం మిమ్మల్ని మోసం చేస్తుంది. కానీ అది మీకు ఏమైనా అర్థం అవుతోందా?

నాన్నగారు మేము సాధన చేస్తున్నాము, కష్టపడుతున్నాము అని ఈ రోజు అంటారు. మళ్ళీ డల్‌గా ఉందండి, ఏంటండీ ఈ బాధలు మాకు, ఏమో భయం వేస్తుంది అని రేపు అంటారు. కొంతమంది దేవుళ్ళని మారుస్తూ ఉంటారు. గురువులని మారుస్తూ ఉంటారు. గురువెవరు? ఆత్మే గురువు. దేవుడెవరు? ఆత్మే దేవుడు. మీరు ఎందుచేత అలా ఒకరోజు ఒకరకంగాను, ఒకరోజు ఒకరకంగాను ఉంటున్నారు? ఈరోజు ఉన్న ఇంట్రెస్టు మీకు రేపు ఎందుకు ఉండటం లేదు? అంటే మనలో ఉన్న కొన్ని దుష్ట అలవాట్లు, మనకి ఉన్న భక్తిని శ్రద్ధని పడగొట్టేస్తాయి. అయ్యో ఇలా పడిపోతున్నాం ఏంటి, పతనం అయ్యిపోతున్నాం ఏంటి అనిపిస్తుంది. ఒక ఇటుక మీద ఒక ఇటుక వేసి గోడకట్టినట్లు నెమ్మదిగా భక్తిని శ్రద్ధగా పెంచుకొంటే అప్పుడు ఈ అలవాట్లు కూలిపోతాయి. మనకి భక్తి నిలబడటం లేదంటే, ఏకాగ్రత నిలబడటం లేదంటే, శాంతి నిలబడటం లేదంటే, కారణం భగవంతుడు కాదు, మనకున్న అలవాట్లు. నాకున్న అలవాట్ల వల్లే నాకు అశాంతి వస్తుంది. నాకున్న అలవాట్ల వల్లే నాకు భక్తి పోతోంది, నాకున్న అలవాట్ల వల్లే నాకు కాంతి లేదు. నాకున్న అలవాట్ల వల్లే నాకు దారి కనిపించడం లేదు. అంతేగానీ బయట కారణాలు ఎంత మాత్రం కాదు. ప్రతి మనిషిని వాడి ఇంద్రియాలు, మనసు వాడిని ఎక్కువ మోసం చేస్తున్నాయి.

తపస్సు అంటే మన ఇంద్రియాలని, మన మనస్సుని , భగవంతుడి వైపు ఏకాగ్రతగా నిలబెట్టి ఉంచడమే తపస్సు. విషయ చింతన లేకుండా, నా మనస్సుని, నా ఇంద్రియాలని ఆత్మ వైపు నిలబెట్టి ఉంచడమే తపస్సు. ఎవరికైతే పూర్తిగా వాసనా క్షయం అయ్యిందో, వాడికి ఏకాగ్రత ఉంటుంది గాని, లోపల వాసనలు ఉంటే వాడిని ఏకాగ్రతతో కూర్చోనివ్వవు.

పూర్వం ఒక దేవాలయంలో ఒక స్వామి వారు ఉండేవారు. ఆ స్వామి వారు అలా కూర్చుని, ఉదాసీనంగా ఉండేవారు. జరిగిన సంఘటన ఇది. ఆయనకి రెండు పూటలా భోజనము పెట్టేవారు ఆ టెంపుల్ డిపార్టుమెంటు వాళ్ళు. ఒకసారి పై ఆఫీసర్ ఎవరో వచ్చి, ఈ స్వామి వారికి అన్నం పెడుతున్నారు, వారు ఏమి పని చేస్తారు అని అడిగితే, పనేమీ లేదు ఊరికే కూర్చుంటారు అని చెప్పారు. పని లేని వాడికి మీరు రెండు పూటలా అన్నం పెట్టడం అనవసరం ఖర్చు, దేవస్థానం డబ్బిది. ఊరికే కూర్చుంటున్నాడు, వాడికి రెండు పూటలా అన్నం దండుగ అన్నాడు. అప్పుడు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆ స్వామితో, ఏవండీ మా పై ఆఫీసర్ గారు మీరు ఏమీ పని లేకుండా ఊరికే కూర్చుంటే మీకు రెండు పూట్లా అన్నం పెట్టడం దండుగ అంటున్నారు అని చెప్పాడు. అప్పుడాయన నేను ఊరికే కూర్చుంటున్నాను అని కదా మీ ఆఫీసర్ గారు అంటున్నారు. మీరు, మీ ఆఫీసర్ గారు, ఇద్దరు చేసే పని నేను చేస్తాను. నేను చేసే ఊరికే కూర్చోవడం అనేది మీ ఆఫీసర్ గారిని చెయ్యమను. మీ ఆఫీసర్ గారు, మీరు కూడా ఊరికే కూర్చోండి. ఆ ఊరికే కూర్చోవడం ఏంటో అప్పుడు తెలుస్తుంది మీకు. ఒక్క ఐదు నిమిషాలు కూర్చోగలరా వాళ్ళు, మీరు ఎప్పుడైనా పది నిమిషాలు ఊరికే కూర్చోండి అప్పుడు మీకు తెలుస్తుంది.

మన అందరికీ దేవుడు పట్టుకోలేదు కానీ దెయ్యం పట్టుకుంది. దెయ్యాలు అంటే ఏమిటి? పూర్వం ఆ ఇంట్లో ఎవరైనా చచ్చిపోతే వాళ్ళే దెయ్యాలు అనే వారు. ఆ దెయ్యాలతోటి అంత ప్రమాదం లేదు. కొంచెం సేపు అటు ఇటు ఏడిపించి వెళ్లిపోతాయి. ఎవడి అహంకారం వాడికే దెయ్యం. నా అహంకారం నాకు దెయ్యం, మీ అహంకారం మీకు దెయ్యం. నా లోపల ఉన్న దేవుణ్ణి తెలుసుకోకుండా నా అహంకార రూపంలో ఉన్న దెయ్యమే నాకు అడ్డు వస్తూ ఉంటుంది. వాడిలోని ఈశ్వరుడిని తెలుసుకోకుండా అడ్డు పడుతుంది.

నాలో ఈశ్వరుడు ప్రకాశిస్తున్నాడు. నాలో ఉన్న ఈశ్వరుడే మీలో ప్రకాశిస్తున్నాడు. ఉన్న వస్తువు ఒకటే, ఎవరైతే సత్వగుణం తోటి ఇంద్రియాలని స్వాధీనం చేసుకుని, మనసుని స్వాధీనం చేసుకుని, జాగ్రత్తగా యుక్తాహారం తీసుకుంటూ, యుక్తంగా మాట్లాడుతూ, ఒక రోజు రెండు రోజులు కాకుండా, జీవితం పొడవునా ఎవరైతే అణకువగా ఉండి, వినయంగా ఉండి, జాగ్రత్తగా ఉన్నారో వారికి ఆ వస్తువు తెలుస్తుంది. ఇపుడు చూడండి నాకు ఒకసారి కోపం వస్తుంది అనుకోండి మాటవరసకి, ఎవరికి కోపం వస్తుంది? శరీరానికి కోపం వస్తుందా? లేక నాలో ఉన్న అహంకారానికి కోపం వస్తుందా? ప్రతి మనిషి కూడా దెయ్యం పట్టిన మనిషే. ఒక విషయం మనసులో ఉంచుకోండి. నేను మీ గురించి సద్భావంతోటి, మంచి ఆలోచన తోటి, మంచి ఊహాలతోటి ఉన్నాను అనుకోండి; ఈ శరీరం పడిపోయిన తరువాత కూడా ఆ తలంపు పోదు. తలంపుకి చావు లేదు, శరీరానికి చావు ఉంది.

నేను మిమ్మల్ని అందరినీ ప్రేమిస్తున్నాను అనుకోండి, ఎవరు ప్రేమిస్తున్నారు? శరీరం అనేది ఎక్కడైనా ప్రేమిస్తుందా? నా భావన ప్రేమిస్తుంది. శరీరం పోయినప్పుడు భావన అలాగే ఉంటుంది. తలంపు ప్రేమిస్తుంది, భావనా బలం ప్రేమిస్తుంది. అయితే శరీరం మరణించినప్పుడు భావన మరణించదు. అందుచేత, మీకు నిరంతరం రాత్రి గాని, పగలు గాని, మంచిఆలోచనలు, మంచితలంపులు వచ్చేలా చూసుకోమని చెప్పారు. మంచి తలంపులు, మంచిఆలోచనలు వచ్చేలా చూసుకుంటే ఆ శరీరం పడిపోయినప్పటికి కొత్త శరీరంలో కూడా ఆ మంచితలంపులు, మంచిఆలోచనలు ఉంటాయి. ఎందుచేతంటే అవి చావవు కాబట్టి. మనం ఏమి చేస్తున్నాము? మన గుడ్డకి ఇచ్చే విలువ, మన ఇంటికి ఇచ్చే విలువ, మన ఆరోగ్యానికి ఇచ్చే విలువ కూడా మన మనసుకు మనం ఇవ్వటంలేదు, మన తలంపుకి మనం ఇవ్వటం లేదు. అంటే పడిపోయే వస్తువుకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నాము, మన కూడా వచ్చే వస్తువుకు ప్రాముఖ్యత తక్కువ ఇస్తున్నాము.

నిప్పుకి వేడి సహజం, నీళ్ళకి చల్లదనం సహజం, అలాగే ఈశ్వరుడికి అనుగ్రహం సహజం. నిప్పుకి ఏ విధంగా అయితే వేడి సహజ గుణమో, ఈశ్వరుడికి ప్రేమ అనేది కూడా అలాగే సహజ గుణం. అయితే భగవంతుడు అనే వాడు ఉన్నమాట నిజం. ఆయనని ప్రేమించాలని మనం కోరుకున్నమాట నిజం. ఇక్కడ కూర్చున్న పదిమంది మాట చెపుతున్నాను. భగవంతుడు ఉన్నాడని మనకి తెలుసు, భగవంతుణ్ణి ప్రేమించాలని తెలుసు. భక్తిగా ఉండాలని తెలుసు, ఆయన్ని ఆశ్రయించాలని తెలుసు. ఇన్ని చెప్పుకుంటున్నప్పటికి మనము ఎందుకు నిలబెట్టుకోలేకపోతున్నాము? అంటే మన అలవాట్లు కారణం. భగవంతుణ్ణి ప్రేమిద్దాము అనుకుంటే మన అలవాట్లు మనకి అడ్డువస్తాయి. ఈ అలవాట్లు సత్పురుషుల సహవాసం వల్ల పోతాయి. మీరు కోటి రూపాయలు పెట్టి సత్రాలు కట్టించటం కంటే, ఒక జ్ఞానిని సేవిస్తే తొందరగా మీకు జ్ఞానం కలుగుతుంది. పెద్దలకి సేవ చేయటంవల్ల, జ్ఞానికి సేవ చేయటం వల్ల మీకు తొందరగా జ్ఞానం కలుగుతుంది. అందుచేత భగవంతుడు గీతలో, నువ్వు జ్ఞానిని ఆశ్రయించి, సేవ చేసి, జ్ఞానిని సంతోషపెట్టి, అప్పుడు నీకు తెలియని విషయాలను ప్రశ్నించి జ్ఞాని ద్వారా తెలుసుకో అన్నాడు.

నీకు ఈ ప్రపంచం నిజంగా కనిపిస్తున్నంత కాలం మీరు ఎన్ని సాధనలు చేసినప్పటికీ మనసు మిమ్మల్ని వదిలిపెట్టి బయటకి వస్తూనే ఉంటుంది. ఒక్క జ్ఞాని తప్పించి అకారణంగా లోకాన్ని ఎవరు ప్రేమించలేరు. మీ ఇంట్లో ఒకళ్లని ఒకళ్ళు ప్రేమించుకుంటున్నారు. అది నిజామా అబద్ధమా? దానికి కారణం ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకుని ప్రేమించుకుంటున్నారు. యధార్థం చెప్పాలంటే మనం అందరం వ్యాపారస్తులం. ఇంట్లో కూడా ఒకళ్లతో ఒకళ్ళకి ఉండే ప్రేమ కూడా అబద్ధం. ఒకటికి బదులు ఒకటి ఆశించి, వాళ్ళని ప్రేమిస్తే మనకి సుఖం వస్తుందని, మనల్ని ప్రేమిస్తే వాళ్ళకి సుఖం వస్తుందని చూసుకుంటారు. నువ్వు అణా ఇచ్చి పటికి బెల్లం ఎలా తీసుకుంటున్నావో, ఇంట్లో కూడా ఒకళ్లని ఒకళ్ళు అలా ప్రేమించుకుంటున్నారు. ఇది వ్యాపార ప్రేమ. వ్యాపార ప్రేమ ఎక్కడ? భగవంతుని ప్రేమ ఎక్కడ! మన ఇంట్లో ఉన్న మనుషులనే మనం కారణం లేకుండా, స్వార్థం లేకుండా ప్రేమించలేక

పోతున్నాం, మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి. మన ఇంట్లో ఉన్న వ్యక్తులని గాని, మన ఊర్లో ఉన్న వ్యక్తులని గాని, ఏమి స్వార్ధం లేకుండా, అపేక్ష లేకుండా, మనం ప్రేమించడంలేదు. ఒక్క జ్ఞాని మాత్రమే లోకాన్ని అకారణంగ ప్రేమించగలడు. అది ఒక్క జ్ఞానికే సాధ్యం. అయితే భక్తి లేదా మనకి, భగవంతుని ప్రేమించడం లేదా అంటే ప్రేమిస్తున్నాము. ఎలా ప్రేమిస్తున్నాం అంటే, మనం లోకానికి సంబందించిన ఏవో విషయాలు వాంఛించి ప్రేమిస్తున్నాం. అపుడు మీకున్న వాంఛకి, మీకున్న కోరికకి, మీకున్న స్వార్ధానికి ఆ ప్రేమ పరిమితం అయిపోతుంది. భగవంతుని మనం ప్రేమిస్తున్నాము అంటే దానికి కారణం కనిపిస్తుంటే, అది నిజమైన ప్రేమ కాదు అని అర్ధం.

విదేహముక్తులని, జీవన్ముక్తులని, నిత్యముక్తులని ఇలా రకరకాలుగా ఉంటారు. విదేహ ముక్తుడు అంటే దేహం పడిపోయే టైములో వాడికి ముక్తి వస్తుంది. జీవన్ముక్తుడు అంటే దేహం ఉండగానే ముక్తిని పొందుతాడు. దేహం మనకి అడ్డు రాదు. నిజంగా మనకి అహంకారం పడిపోయింది అనుకోండి నాకు మోక్షం రాకుండా ఈ దేహం నన్ను అడ్డుకోలేదు. చావుకి, మోక్షానికి ఏమిటి సంబంధం? నా అహంకారం పడిపోతే ఇప్పుడు కూడా నేను మోక్షం పొందవచ్చు. నేను చచ్చిపోయే వరకు వేచి ఉండక్కరలేదు. చాలామంది ఏమి అనుకుంటున్నారు అంటే చచ్చిపోయిన తరువాత మోక్షం వస్తుంది, ఇప్పటినుంచి రాదు అనుకుంటున్నారు. అలా కాదు దేహం అడ్డురాదు అసలు. అంటే దేహం మరణంతో మనకి సంబంధం లేదు. దేహం ఉండగానే మనకి మోక్షం వస్తుంది, మనలో ఉన్న అహంకారం నశిస్తే. దేహం మనకి అడ్డు కాదు. అయితే దేహంలోని ప్రారబ్దం ఖర్చు అయ్యేవరకు, బొంగరం తిరిగినట్టు తిరిగి పడిపోతాము. అయితే దేహం ఉండగా ఎవరికైతే అహంకారం పడిపోయిందో వాడికిక జీవత్వం పోయింది కాబట్టి, కొత్త వాసనలు రావు. ఈ వాసనలని పోగుచేసుకోవటం జీవలక్షణం, ఈశ్వరలక్షణం కాదు. ఈ భేదదృష్టి కూడా జీవలక్షణమే, ఈశ్వరలక్షణం కాదు. భగవాన్ ఒక ఉదాహరణ చెప్పారు. సినిమా తెర మీద ఒక్కొక్కసారి పెద్ద పెద్ద మంటలు వచ్చేస్తాయి కాని, సినిమా తెర మట్టుకు కాలదు. ఒక్కొక్కసారి సినిమాలో కూడా పెద్ద పెద్ద వర్షాలు కురిసేస్తాయి.కాని సినిమా తెర తడవదు. తెర మీద నిప్పు ఉన్నప్పుడు అంటుకోదు, నీరు ఉన్నప్పుడు తడవదు. అదేవిధంగా ఈ ప్రపంచంలో జరిగే సంఘటనలని కూడా జ్ఞాని అలాగే చూస్తారు. తెర మీద ఉన్నటువంటి బొమ్మల ఎఫెక్టు, తెర మీద ఎలా ఉండదో, జ్ఞాని మీద ఈ ప్రపంచానికి సంబంధించిన, అహంకారానికి సంబందించిన, మనసుకి సంబందించిన ఎఫెక్టు కూడా అలాగే ఉండదు. కాని జ్ఞాని కూడా చూస్తాడు, ఆ ఎఫెక్ట్ వీడి మీద ఉండదు.

జ్ఞాని మరణించాడు అనుకోండి మరణం కూడా సినిమాలో బొమ్మ చూసినట్టే ఉంటుంది. ఎందుచేత అంటే తన దేహం నుండి విడిపోయినప్పుడు ఇక మరణం సమస్య లేదు వారికి. రమణ మహర్షి, రామకృష్ణ పరమహంస వాళ్ళు నిత్య ముక్తులు. కొంతమంది జీవన్ముక్తులు, కొంతమంది విదేహ ముక్తులు, కొంతమంది క్రమ ముక్తులు శరీరం పడిపోయిన తరువాత ఏవో కొన్నిసూక్ష్మ వాసనలు ఉండిపోయి, ఈశ్వరానుగ్రహం వల్ల

కాలిపోయి క్రమ ముక్తి పొందిన వాళ్ళు ఉన్నారు. రకరకాలు ఉన్నారు. కొంతమంది బద్ధజీవులు అని ఒక క్లాజ్ పెట్టారు రామకృష్ణ పరమహంస. చాకలివాడు రాతి మీద బట్టలు కొట్టేసినట్టు కొట్టేసినా వాళ్ళు అంతే! ఆ బద్ధజీవులు సంసారచక్రంలో పడిపోవలసినవాళ్ళే. వాడిని మీరు రంపం పెట్టి కోసేసినా, వాడికి జ్ఞానం రాదు అన్నారు. అంటే వాడు తడచిపోయిన అగ్గిపుల్లతో సమానం. ఈ తడిచిపోయిన అగ్గిపుల్లని మనం పెట్టికి గీస్తుంటే ఆ పెట్టి పోతుంది గాని, అది వెలగదు. కొంతమంది జీవులు అంతే, వాళ్ళు బద్ధజీవులు అని పరమహంస గారు చెప్పారు.

ఈ మాయని జయించడం కోసం మనం ఈశ్వరుడిని ఆశ్రయించాలి. మీకు ఈశ్వరుడు ఎక్కడో ఉన్నాడు అనిపిస్తుంది. ఎక్కడో లేడు, మీ హృదయంలో ఉన్నాడు. మీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు ఒక్కడే నిజం. మీకు బయట కనిపించేవన్నీ అబద్ధం. అవి ఊరికే ఆరాధన కోసం. ఉపాసన కోసం, భక్తి కోసం, మన ఏకాగ్రత కోసం, అలా పెట్టారు. ఆత్మని ధ్యానించలేము కదా. అంచేత ఏదో ఒక విగ్రహాన్ని ధ్యానించటం కోసం, ఉపాసన కోసం ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాలు అన్నీ నిగ్రహం కోసం ఏర్పాటు చేసినవి. అయితే మన అందరికి భక్తిగా ఉండాలని ఉంది కాని, మన మనసుకి శక్తి చాలటం లేదు. ఎంతోకొంత భక్తి ఉండటం వల్లే కదా ఇక్కడకి వచ్చారు దాన్ని నిలబెట్టుకోవడానికి శక్తి చాలటం లేదు. ఆ శక్తి ఎలా కలుగుతుంది? ఈశ్వరుడిని ప్రార్థించగా, ప్రార్థించగా మనలో ఉన్న తలంపులు అంటే అలవాట్లు పడిపోతాయి. ఈ అలవాట్లు అనే గొలుసులు మన మనస్సును కట్టేస్తున్నాయి. మనసుకి స్వేచ్ఛ లేదు. మనం ఈశ్వరుడి యొక్క పాదాలను ఆశ్రయించడం వల్ల మనకున్న అలవాట్లు ఒకదాని తరువాత ఒకటి రాలిపోతూ ఉంటాయి. మీకు దుఃఖం వస్తుందనుకోండి, దానికి కారణం తలంపులు. తలంపు రూపంలో వస్తుంది దుఃఖం. తలంపు అహంకారం నుంచి వస్తుంది.

మీకు భక్తి అభివృద్ధి అవ్వాలంటే ఒక చిన్న ఉపాయం చెపుతున్నాను. ఈ నామరూపాల వల్ల ఇబ్బందులు ఉన్నాయి, ఇవి మనకు అడ్డు అని ఏ నామరుపాల్ని అయితే వదిలేసారో, వదిలేసిన నామరుపాల్ని మళ్ళీ మీ మనసులోకి రాకుండా చూసుకుంటే మీకు భక్తికి అడ్డు లేనట్టే. మట్టి రోడ్డు మీద, కంకర రోడ్డు మీద కూడా ప్రయాణం చేయచ్చు. భగవాన్ మార్గం ఎటువంటిదంటే సిమెంట్ రోడ్డు మీద ప్రయాణం చేయడం. మట్టి రోడ్డు మీద కంకర రోడ్డు మీద ప్రయాణం, ప్రయాణం కాదు అని నేను చెప్పటం లేదు. అదీ ప్రయాణమే.

మాయ ఈశ్వరుడి చేతిలో ఉంది, మనం మాయ చేతిలో ఉన్నాం. అంటే మాయకి అధిపతి భగవంతుడు. భగవంతుడిని ఆశ్రయిస్తే మనం మాయని జయించవచ్చు. మన దేహానికి ప్రారబ్దం ఎలా ఉందో, రాముడికి అలాగే ప్రారబ్దం ఉంది, కృష్ణుడికి అలాగే ప్రారబ్దం ఉంది. అయితే వాళ్ళు కర్మ చేశారా అని మీరు అనుకోవచ్చు. మనం చేసిన మంచి, మనం చేసిన చెడ్డ మన దేహానికి ప్రారబ్దం అయితే, పుణ్యాత్ములు చేసిన పుణ్యం, పాపాత్ములు చేసిన పాపం భగవంతుడి దేహానికి ప్రారబ్దం. మనం మన సొంతంగా చేసిన పుణ్యం పాపం, మన దేహానికి ప్రారబ్దం. మన దేహానికి ఎలా అయితే ప్రారబ్దం ఉందో, భగవంతుడు

శరీరంతోటి వచ్చినప్పుడు ఆయన దేహానికి కూడా అలాగే ప్రారబ్ధం ఉంది.

ఇది మిథ్యా ప్రపంచం. ఇది ఇంద్రజాలంతోటి సమానం. కొంతమంది ఇంద్రజాలం చేసి డబ్బాలోకి రూపాయిలు తెప్పిస్తారు, మళ్ళీ అడుక్కుంటూ ఉంటారు. వాడి ద్వారా వచ్చే రూపాయి నిజం అయితే వాడు అడుక్కోవడం ఎందుకండి? ఎన్నోరూపాయలు తెప్పించేస్తాడు. మన ఎదురుగానే డబ్బాలో రూపాయలు కనపడతాయి అందులో రూపాయలు తెప్పించేస్తూ ఉంటాడు. ఇదంతా ఇంద్రజాలం. మళ్ళీ మనల్ని అడుక్కుంటూ ఉంటాడు; ఏ అర్థ రూపాయో, పావలాయో ఇమ్మని. అదంతా నిజం అయితే ఆ అర్థరూపాయి, పావలా మనల్ని అడగటం ఎందుకు ఇంక? అటువంటి ప్రపంచమే ఇది కూడా. ఆ ఇంద్రజాలం చేసేవాడు స్వరూపంలో ఎంత దరిద్రుడు!

ఈ ప్రపంచములో దుఃఖం ఉంటుంది కానీ, సుఖం లేదు. సుఖం ఆత్మలో ఉంది, ప్రపంచంలో లేదు. మనకి డబ్బు అంటే బాగా ప్రీతి అనుకోండి మాటవరసకి, మనం డబ్బుని విడిచి పెట్టలేకపోయినా, డబ్బు మనలని విడిచిపెట్టేస్తుంది. అలాగే బంగారం అంటే మనకు చాలా ప్రీతి అనుకోండి మాటవరసకి, ఈ బంగారాన్ని మనం విడిచి పెట్టలేకపోయినా, బంగారం మనలని విడిచి పెట్టేస్తుంది. నా దేహం అంటే నాకు బాగా ప్రీతి అనుకోండి వైద్యం చేయించుకుంటాను, రాయవెల్లూరు ఇంకెక్కడికైనా వెళ్తాను. నా దేహం అంటే నాకు చాలా ఇష్టమే కానీ, నా దేహం నన్ను విడిచిపెట్టేస్తుంది. గౌతమబుద్ధుడు ఒక మాట చెబుతాడు. నా దేహమే నాది కానప్పుడు, ఈ విశాల ప్రపంచంలో ఏ వస్తువూ నాది కాదు. ఈమధ్యన ఎవరో ఒకాయన అడిగారు, గౌతమబుద్ధుడు ఒక్క శవాన్ని చూశాడు అతనికి వైరాగ్యం వచ్చేసింది. అన్నీ విడిచి పెట్టేశాడు. నేను రోజూ శవాలని చూస్తున్నాను నాకెందుకు వైరాగ్యం రావటం లేదు అని అడిగాడు. అది నిజమే, మనం రోజూ చూస్తున్నాం శవాలని కాని వైరాగ్యం రావటంలేదు అంటే మనం తడిచిపోయిన అగ్గిపుల్లలు లాంటి వాళ్ళం. ఇంక వెలగవు అవి. రామకృష్ణ పరమహంస చెప్పింది మనం తడిచిపోయిన అగ్గిపుల్ల లాంటివాళ్ళము అని. అగ్గి పెట్టి పాడైపోతుంది గాని, అవి వెలగవు. బాగా ఎండిపోయిన పుల్ల అనుకోండి అలా ముట్టించగానే వెలిగిపోతుంది. గౌతమబుద్ధుడు బాగా ఎండిపోయిన పుల్ల లాంటివాడు.

కొంతమంది ఏమంటారంటే, ఈ వయసులోంచే భక్తి ఎందుకండి మనం ముసలి వాళ్ళం అయిన తరువాత నేర్చుకోవచ్చు కదా అంటారు. ఇది ఒక రకమైన ఆర్గ్యుమెంట్. ఎవరైనా ఇరవై సంవత్సరాల వయసు ఉన్న వాళ్ళో, పాతిక సంవత్సరాల వయసు ఉన్న వాళ్ళో ఇక్కడ కూర్చున్నారు అనుకోండి, వాళ్ళు రోడ్డు మీదకి వెళ్ళాక, ఇప్పటినుంచి ఎందుకు, ముసలి వాళ్ళు అయ్యాక నేర్చుకోవచ్చు కదా అని చెబుతారు. అంటే ఇప్పటినుంచి మనం అన్నం తినాలి. బట్ట కట్టుకోవాలి. లోకంలోని భోగాలని, లోకం గోల అంతా నెత్తిన వేసుకుని తిరగాలి. కానీ ఇప్పటినుంచి జ్ఞానం సంపాదించకూడదు అన్నమాట. ఇప్పటినుంచి ఊరిమీద ఉన్న గొడవలు అన్నీ నెత్తిన పెట్టుకుని తిరగాలి, రాగ ద్వేషాలు నేర్చుకోవచ్చు. ఇంటిదగ్గర పేచీలు పెట్టడం నేర్చుకోవచ్చు, ఊర్లో ఒకరిని ఒకరు కష్టపెట్టడం నేర్చుకోవచ్చు, సినిమాలు చూడటం నేర్చుకోవచ్చు, సారా తాగటం నేర్చుకోవచ్చు, అన్నీ నేర్చుకోవచ్చు కానీ జ్ఞానము నేర్చుకోకూడదు

అన్నమాట ఇప్పటినుంచి! ఇది ఏమి ఆర్గ్యుమెంట్ అండి!

ఈ ప్రశ్న మీకు లోకంలో ప్రతి ఊర్లో కనిపించే ప్రశ్నే. ఎదిగిన పిల్లలు ఎవరైనా ఉంటే, ఎందుకు ఇప్పటినుంచి అంటారు. అంటే ఇప్పటినుంచి జ్ఞానం నేర్చుకోవద్దు పోనీ, ఏమి నేర్చుకోవాలి? చెప్పేవాళ్ళకి కౌంటర్ ప్రశ్న వేస్తున్నాను నేను. అది చెప్పగలగాలి వాడు. ఇప్పటినుంచి నీకు ఇదంతా ఎందుకు అన్నవాడు తిరిగి రిప్లై ఇవ్వగలగాలి. వేదాంతం అంటే అర్థం జ్ఞానం అని, ముసలి వాళ్ళు అయిన తరువాత బట్టలు కట్టుకోవచ్చు కదా ఇప్పటినుంచి ఎందుకు? అన్నం కూడా ముసలి వాళ్ళు అయిన తరువాత తినచ్చు కదా, ఇప్పటినుంచే తినడం ఎందుకు? ఇప్పటినుంచి సినిమాలు చూడచ్చు, ఇప్పటినుంచి బట్టలు కట్టుకోవచ్చు, ఇప్పటినుంచి రాగ ద్వేషాలు నేర్చుకోవచ్చు. ఇప్పటినుంచే కక్షలు, కార్పణ్యాలు అన్నీ నేర్చుకోవచ్చు. కానీ జ్ఞానంమటుకు ముసలి వాళ్ళం అయ్యిన తరువాత నేర్చుకోవటం మొదలు పెట్టాలా? ఏం ఆర్గ్యుమెంట్స్ అండి ఇవి?

అంటే సొంతంగా ఆలోచించుకునే శక్తి మనకు లేదు కాబట్టి, వాళ్ళు చెప్పిన వాటికి గంగిరెద్దులా ఊకొడుతున్నాము. ఒకరకంగా మన జీవితాలు గంగిరెద్దు జీవితాలు. గౌతమ బుద్ధుడు ఈ మానవ లోకంలో మనుషులందరూ కూడా గొర్రెలు అన్నాడు. గొర్రెలమందని ఎప్పుడైనా చూడమన్నాడు ఆయన, పొరపాటున ఒక గొర్రె కాలుజారి గోతులో పడితే, ఆ గోతులో ఏదో మేత ఉండి ఉంటుంది, అందుకే ఆ గొర్రె అందులో పడింది అనుకుని మిగతా గొర్రెలు కూడా ఆ గోతులోనే పడిపోతాయి అంట. అది ఆక్సిడెంట్ వల్ల ఆ గోతులో పడింది. మానవ లోకం కూడా అంతే అన్నాడు.

రాగద్వేషాలతోటి, కామక్రోధాలతోటి ఇటకాము కాలినట్టు నిరంతరం కాలిపోయే మనిషి దగ్గరికి మనం సలహాకి వెళ్ళటం ఏమిటి, జ్ఞానం గురించి అడగటం ఏమిటి? వాడినసలు ఎడ్వైజ్ అడగద్దని అన్నాడు గౌతమ బుద్ధుడు. నిరంతరం రాగద్వేషాల తోటి, కామక్రోధాలు తోటి కాలిపోయే ఈ మనుషులా నీకు సలహా చెప్పేది? మీరు ఎంత పనైనా చేయవచ్చు, కర్త ృత్వము లేకుండా చెయ్యాలి. ఈ ప్రపంచం ఒక గ్రౌండు. బ్యాడ్మింటన్ ఆడేవాడు, వాలీబాల్ ఆడేవాడు గ్రౌండ్లోకి నేర్చుకోటానికి వస్తారు. అలాగే మనం ట్రైనింగ్ అవ్వడం కోసం ఈ లోకంలోకి వచ్చాము. ఈ ప్రపంచం కూడా ప్లే గ్రౌండ్.

అలవాట్లు అంటే మీరు సామాన్యం అనుకోకండి. మనం జన్మించినప్పుడు పది చెడ్డ అలవాట్లుతో గనుక పుడితే, మరణించేటప్పటికి ఒక్క చెడ్డ అలవాటు తగ్గించుకున్నా అది గెలుపే / గ్రేట్ అచీవ్మెంటే. ఉదాహరణకి పది చెడ్డ వాసనలతోటి మనం పుట్టాము అనుకోండి ఈ భూమి మీదకి వచ్చినప్పుడు, కనీసం ఒక్క చెడ్డ వాసన పూర్తిగా వేరుతో సహా పోగొట్టుకుని మనం మరణిస్తే, కనీసం ఆ ఒక్క చెడ్డ అలవాటు అయినా పోయింది కాబట్టి వాడు అంతవరకు సక్సెస్ అయ్యినట్టే. గురువు యొక్క అనుగ్రహం కంటే గొప్పది ఈ విశ్వంలో ఏమి లేదు. మీరు చేసే ధ్యానాలు కంటే, జపాలు కంటే, పూజలు కంటే గురువు అనుగ్రహమే మిన్న. గురువు అనుగ్రహానికి సమానం అయ్యింది లేదు అసలు. సమానం అయ్యిందే లేనపుడు మించింది ఉందని ఎలా చెబుతాము? అందుచేత భగవాన్ చెప్పారు పులి నోట్లో పడ్డ

మాంసపు ముక్క ఏ విధంగా అయితే బయటకి రాదో, గురువు యొక్క అనుగ్రహంలో పడ్డవాడు అలాగే బయటకి రాడు అన్నారు.

మన మనసు ఎప్పుడు నిజమైన మాటలని ప్రేమించదు. మాయ మాటలని ప్రేమిస్తుంది. ఎందుకంటే మనసు మాయ కాబట్టి. మన మనసు ప్రకృతి వైపుకి వెళ్తుంది గాని, భగవంతుడి వైపుకి వెళ్ళదు. ఎందుకంటే మనసు ప్రకృతి కాబట్టి. మనకి ఉన్న తెలివి తేటలు ఎంత, మన బుద్ధి వైభవం ఎంత! రాబోయే జన్మ ఏంటో మనకి తెలీదు. గత జన్మ తెలీదు. ఈ జన్మలో మనం ఏమి సాధించాము ఏమి చేశాము అంటే, ఏమీ కనపడదు. ఇటువంటి బుద్ధిని నమ్ముకోవాలా, లేక భగవంతుడు చెప్పిన మాటలని నమ్ముకోవాలా? మన బుద్ధి రోజుకి పది రకాలుగా ఉంటుంది. ఇటువంటి నా బుద్ధి నాకు ప్రమాణమా, భగవంతుడు చెప్పే మాటలు నాకు ప్రమాణమా? భగవంతుడి మాటలు వదిలేసి ఒక నిమిషం కూడా కుదురుగా ఉండని నా బుద్ధిని, నా మనసును నేను ప్రమాణంగా తీసుకోవాలా? పోనీ మీ బుద్ధినే ప్రమాణంగా తీసుకుందాం, మీ మనసునే ప్రమాణంగా తీసుకుందాం, మీ అహంకారాన్నే ప్రమాణంగా తీసుకుందాం. మీ అహంకారం కాని, మీ బుద్ధి కాని, మీ మనసు కాని ఏమైనా మిమ్మల్ని సుఖపెడుతుందా? నిరంతరం మిమ్మల్ని దుఃఖంలో దింపి, నిరంతరం మిమ్మల్ని నరకంవైపు నడిపించే మీ మనస్సుని మీ అహంకారాన్ని మీరు ప్రమాణంగా తీసుకుంటారా? లేక భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకుంటారా?

మీ బుద్ధికి తోచినట్టు చెయ్యడం గొప్ప కాదు! భగవంతుడు చెప్పినట్టు చెయ్యడం గొప్ప! బుద్ధి చెప్పినట్టు అందరూ చేసేయగలరు. చెడ్డ వాడూ చేస్తాడు. మంచి వాడూ చేస్తాడు. నాకు క్షీరాన్నం అంటే ఇష్టం అనుకోండి, క్షీరాన్నం తాగటం ఏమైనా గొప్పా? కాకరకాయి కూర అంటే ఇష్టం లేకపోయినప్పటికి ఆరోగ్యానికి మంచిది కాబట్టి మీరు తినగలగాలి, అది గొప్ప. ఎవడికి ఇష్టమైన పని వాడు ఎంత నీచుడయినా చేస్తాడు. ఎవడికి ఇష్టమైన పని చెయ్యటం గొప్ప కాదు. హితం కలిగించేది, మంచిది అయితే తనకి ఇష్టం లేకపోయినా చెయ్యగలగాలి అది గొప్ప. ఇష్టమైన పని అందరూ చెయ్యగలరు. నాకు సినిమాలు చూడటం ఇష్టం అనుకోండి, నేను సినిమాలు చూడటం కూడా గొప్పేనా? నాకు ఇష్టం లేకపోయినప్పటికి, నా బుద్ధికి ఇష్టం లేకపోయినప్పటికి అది మంచిదని పరమాత్మ చెప్పినప్పుడు దానిని నేను చెయ్యగలగాలి అది గొప్ప. అది గ్రేట్నెస్ అంటే.

ఎవరైతే చేస్తున్న పని గందరగోళం లేకుండా ప్రశాంతంగా చేస్తున్నాడో, ప్రశాంతంగా జీవిస్తున్నాడో, ఎవరైతే జీవనదిలాగా పది మందికి ఉపకారం చేస్తున్నాడో వాడిని జ్ఞానం వరిస్తుంది. నది చూడండి ప్రవహిస్తూ ఉంటుంది, అందులో పొలాలకి నీరు పెట్టుకుంటారు, బిందెలతోటి నీరు తెచ్చుకుంటారు. అనేక మందికి ఉపయోగపడుతుంది. అది మన వంక చూడదు, దాని ప్రవాహంలో అలా వెళ్లిపోతూ ఉంటుంది. మన పొగడ్తలు దానికి అక్కరలేదు. ఎవరి జీవితం అయితే జీవనదిలా ప్రవహిస్తుందో, రెండోవాడికి కూడా తెలియకుండా తాను చేయవలసిన మంచి ఎవడైతే చేసుకు పోతున్నాడో, ఎవడైతే ఎదుటి వారి యొక్క పొగడ్తలను, ఎదుటి వాడి అభిమానాన్ని ఎవడైతే ఆశించడో, ఎగుడుదిగుడు లేకుండా

ఎవడైతే సమానంగా జీవిస్తాడో, వాడిని జ్ఞానం వరిస్తుంది. వాడికి జ్ఞానం సిద్ధిస్తుంది.

లోపల ఉన్న ఆత్మ జడ వస్తువు అనుకోకండి. మీ హృదయంలోని ఆత్మను మీరు తెలుసుకోవాలి అని ఎంతైతే కోరికగా ఉన్నారో, మీకు ఎప్పుడు తెలియపడదాము అని లోపల ఉన్న ఆత్మ వస్తువు కూడా మీ కోసం అంతగా ఎదురుచూస్తూ ఉంటుంది. నేను ఈశ్వరుడిని తెలుసుకోవాలి అనే కోరిక మీకు వచ్చినప్పుడు, ఈశ్వరుడి కోసం ఎలా తపిస్తారో, అంతకన్నా ఎక్కువగా మీలో ఉన్న నిజమైన ఆత్మ, మీలోని నిజమైన ఈశ్వరుడు, ఆ వస్తువు మీకోసం తపిస్తుంది. అది జడవస్తువు అని మాత్రం మీరు అనుకోవద్దు. లోపల ఉన్న ఈశ్వరుడు జడవస్తువు కాదు.

చేతులతోటి పని చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. నోటితోటి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. కొంతమంది నోటితోటి మాట్లాడతారు. కొంతమంది హృదయంతోటి మాట్లాడతారు. నా హృదయంలో ఏమీ లేదు అనుకోండి, నేను నోటితోటి మాట్లాడుతున్నాను అనుకోండి, మీలో ఏమీ ఎఫెక్టు ఉండదు. నేను చెప్పే విషయం నా గుండెల్లో ఉంటే, మీ గుండె మీద పనిచేస్తుంది. నా గుండెలో ఏమీ లేకుండా నేను నోటితోటి మాట్లాడుతుంటే, దాని ప్రభావం మీ మీద ఉండదు. నా దగ్గర లేని వస్తువు మీకు ఎలా ఇవ్వగలను? నా గుండెలో లేని దానిని మీకు ఎలా ఇవ్వగలను?

మీరు శ్రద్ధగా వినడం యజ్ఞం. విన్న విషయాన్ని మననం చేయటం యజ్ఞం. అది మళ్ళీ ధ్యానం చేయటం యజ్ఞం. అంతేకానీ మీరు శ్రవణమననాలు లేకుండా ఏదో మంచి పనులు చేస్తున్నాము, మాకేదో మోక్షం వస్తుంది అని ఎవరు కూడా ఆశ పడకండి. మీరు సబ్జక్టు గురించి వినాలి. మేము చాలా కోటీశ్వరులము అండి, మాకు చాలా డబ్బు ఉంది కాబట్టి మాకు జ్ఞానం వచ్చేస్తుంది అని గర్వంలో మాత్రం ఉండకండి, డబ్బు వల్ల జ్ఞానం రాదు. ఈ ప్రపంచాన్ని పాలించిన చక్రవర్తులే ఉత్తి చేతులతో వెళ్ళిపోయారు. అలెగ్జాండరు ఎన్నో దేశాలు జయించాడు. జయించి, జయించి, మరణించేటప్పుడు ఏమి సాధించాను అంటే, అతనికి ఏమీ కనపడలేదు. ఆయన ఏమి చెప్పాడు అంటే ఈ శరీరం మరణించిన తరువాత శవాన్ని తీసుకొని వెళ్ళేటప్పుడు నా శరీరం అంతా కప్పేయవద్దు, రెండు చేతులు మటుకు బయటకు పెట్టి ఉంచమన్నాడు. అంటే అలెగ్జాండరు లాంటి చక్రవర్తే వొట్టి చేతులతోటి బయటికి పోయాడు అని. మీకు ధనం ఉంటే దాచుకోండి, మీకున్న చదువు వల్లో, మీకున్న ధనం వల్లో, జ్ఞానం వస్తుంది అని ఎప్పుడూ ఊహించకండి అసలు! మీకు ఎన్ని కోట్లు ఉన్నా, మీకు జ్ఞానం రాదు. ధనం జడవస్తువు. పుస్తకాలు చదివి ఒకడు డాక్టరు అవ్వచ్చు, ఒకతను ఇంజనీరు అవ్వచ్చు, ఒకతను అగ్రికల్చరిస్టు అవ్వచ్చు. పుస్తకాలు చదివి ఒకడు ఉపన్యాసాలు చెప్పచ్చు, రామాయణమో, భారతమో పురాణాలు రాయచ్చు. ఇదంతా అజ్ఞానం. లోపల ఉన్న పరమాత్మ రూపంలోని ఈశ్వరుణ్ణి ఎవరైతే తెలుసుకోడో అటువంటి ప్రతివాడు అజ్ఞాని.

ఉన్నది ఒకటే వస్తువు, ఉన్నది ఒకటే నిజం. దాన్ని పొందేవరకు మనకు స్వేచ్ఛ రాదు. ఫ్రీడం రాదు. దాన్ని పొందేవరకూ మనకి బంధం తప్పదు. నా చదువు, నా డబ్బు

నా స్వరూపానికి దూరం తీసుకెళుతుంటే, అంతకంటే నేను దరిద్రుడిగా ఉండటం మంచిది. అంతకంటే నేను చదువు లేనివాడిగా ఉండటం మంచిది. అందుచేత మేము గొప్ప ధనవంతులం, సత్రాలు కట్టేసి, గుడులు కట్టేసి, మేము మోక్షాన్ని సంపాదించుకుంటాం అని ఎవరూ అనుకోవద్దు. అలా రాదు. సబ్జెక్టుని మీరు శ్రవణం చేయాలి, శ్రవణం చేయాలి, శ్రవణం చేయాలి. శ్రవణం చేసినదానిని జాగ్రత్తగా మీరు మననం చేసి, బుద్ధి తోటి దానిని మరో సారి మరో సారి రాపాడించుకోవాలి. అలా చేయవలసిందే కానీ, మీరు కొనుక్కునే వస్తువు కానే కాదు. పర్చేజ్ చేసుకునే అవకాశం లేదు, మీకు ఎంత ఐశ్వర్యం ఉన్నా సరే! ప్రెస్సుల్లో ప్రింటు అయ్యే ఈ రూపాయి కాగితాలు కాదు ఐశ్వర్యం అంటే; మనలోని ఆత్మ ఐశ్వర్యం! మీరు ఆలోచించవలసింది ఏమిటంటే, మనకు మరణం వస్తే దేహం కనపడదు, ప్రపంచం కనపడదు, అనే కదా మీకు భయం వేస్తుంది? రైటే! ప్రపంచానికి, మీకు బంధుత్వం ఏమిటి? మీకు ప్రపంచానికి ఏమైనా స్నేహం ఉందా, చుట్టరికం ఉందా? అది ఆలోచించండి.

ప్రపంచం కోసం మనం ఏడుస్తున్నాము కానీ, మన కోసం ప్రపంచం ఏడుస్తుందా? ఇలా ఎంతమందిని చూసింది అది? మీరు జ్ఞాపకం ఉంచుకోండి, మనల్ని ఎవరైతే ప్రేమిస్తున్నారని అనుకుంటున్నామో, మనం మరణించిన తరువాత ఒక అరగంట కాఫీకి కూడా ఆగరు వాళ్ళు. ఒక పక్క శవం కాలుతుంటే శ్మశానంలోకి కూడా కాఫీలు తెప్పించుకుని తాగేస్తున్నారు. అది తప్పో, ఒప్పో దాని గొడవ వదిలేయండి అసలు. మనం చచ్చిపోతే మన ఇంట్లో పిల్లలు ఏమి అయిపోతారు, మన చుట్టాలు ఏమి అయిపోతారు, ప్రపంచం ఏమి అయిపోతుంది అని మనం అనుకుంటున్నాం. ఏమీ అవ్వదు. ఒక తినే నోరు తగ్గింది అనుకుంటారు. మన అహంకారం ఇది. మనం లేకపోతే ఏమైపోతుంది ఈ సృష్టి, మన ఇంట్లో వాళ్ళు ఏమి అయిపోతారు అనుకుంటాం. నీడ లేని మొక్కలే బాగా ఎదుగుతాయి. కొంతమంది తల్లితండ్రులు చచ్చిపోయిన పిల్లలు ఎంతమంది అభివృద్ధిలోకి రాలేదు! మరి ఆ తల్లితండ్రులు చచ్చిపోయిన తరువాత ఏమైనా వీళ్ళని చూసారా, పోషించారా? ఆ దేహ ప్రారబ్ధాన్ని బట్టి అలా జరుగుతుంది. నువ్వు లోకాన్ని ప్రేమిస్తున్నావు సరే లోకం నిన్ను ఎంత ప్రేమిస్తుంది? మీకోసం లోకం ఏమైనా కనిపెట్టుకుందా? మన గురించి ఆలోచిస్తుందా? మనలాంటి వారిని ఎంతమందిని చూసింది ఈ లోకం?

మీ మనసు కొంచెం కూడా స్లిట్ అవ్వకుండా, కొంచెం కూడా తెగిపోకుండా, ఆత్మ కోసం ఎదురుచూస్తుంటే, అహోరాత్రులు ఆత్మ కోసమే తపిస్తుంటే, మీకు చదువు అక్కర్లేకుండా, డబ్బు అక్కర్లేకుండా, తెలివి తేటలు అక్కర్లేకుండా మీకు ఆత్మ తెలియ బడుతుంది. మీకు డబ్బున్నా, తెలివి తేటలు ఉన్నా, మీరు ఆత్మ కోసం ఎదురు చూడకుండా మీకు ఆత్మ తెలియదు. నేను ఎవడికైతే తెలియబడాలి అనుకున్నానో వాడికే తెలియ బడతాను అంటాడు ఈశ్వరుడు. మనం ఎన్నుకోవటం కాదు ఆయన ఎన్నుకోవాలి. ఇది ఎలెక్షన్ కాదు సెలెక్షన్. ఆయన సెలెక్ట్ చేసుకోవాలి. ఎలెక్షన్ అయితే పోనీ మనం డబ్బు ఇచ్చి కొనేయచ్చు. ఊర్లో పది వేల ఓట్లు ఉన్నాయి అంటే ఏ లక్ష రూపాయలలో పెట్టి

కొనేయచ్చు. కాని ఇది సెలెక్షన్, ఎలెక్షన్ కాదు.

మనసు లేని వాడికి, అమనస్క స్థితి పొందిన వాడికి ప్రపంచంతోటి పని లేదు. లోకం లేని వాడికి దుఃఖం లేదు. ప్రపంచం మనసులోంచి వస్తుంది. మనసుని దాటిన వాడికి లోకంతోటి సంబంధం లేదు. మీరు ఎంత చిన్న పని చేయండి, ఏ దృష్టితోటి చేస్తున్నారు. అదీ ఈశ్వరుడు చూసి మీకు మార్కులు వేస్తాడు. మీరు ఎంత చిన్న పని చేసినా, చిన్న పనిలో కూడా మీరు సౌందర్యాన్ని చూడాలి. పెద్ద పనులు చేసే వారికి ఎక్కువ మార్కులు వేసి, చిన్న పనులు చేసే వారికి మార్కులు వెయ్యరు, అని మీరు అనుకోకండి. ఎంత చిన్న పని అయ్యినప్పటికి, ఏ దృష్టితో మీరు చేస్తున్నారో, కేవలం అవుట్ అఫ్ లవ్ చేస్తున్నారా, కీర్తి కోసం చేస్తున్నారా, గొప్పలు కోసం చేస్తున్నారా, ఎందుకు చేస్తున్నారు? ఆ పని చేసేటపుడు మీ లోపల భావనను బట్టి మీకు మార్కులు వేస్తాడు ఈశ్వరుడు. మీరు చేసేది చిన్న పనా, పెద్ద పనా అని కాదు. నేను వంద సంవత్సరాలు జీవించాను నాకు ఎక్కువ మార్కులు వేయమంటే వేయడు ఈశ్వరుడు. పది సంవత్సరాలు జీవించినా చాలు. ఇరవై సంవత్సరాలు జీవించినా చాలు, ఎన్నాళ్లు జీవించాము అన్నది కాదు జీవించినంత కాలం ఎలా జీవించాము అన్నదే ముఖ్యం. భగవంతుడు నన్ను స్మరించండి అని చెప్పినా, లేదంటే ధ్యానం చేయండి, యోగాభ్యాసాలు చెయ్యండి అని మనకి సలహా చెప్పినా, ఇందులో ఒకటే రహస్యం - ఇవి మన హృదయాన్ని పవిత్రం చేసుకోవటం కోసమే. ఎవరైతే తన హృదయాన్ని ప్యూరిఫై చేసుకుంటున్నాడో, ఎవరైతే తన హృదయాన్ని పవిత్రవంతం చేసుకుంటున్నాడో వాడికే ఈశ్వరుడు లభ్యం అవుతాడు. వాడే ఈ ప్రకృతి చక్రం నుండి బయటపడగలడు.

సోదరమహాశయులారా, నన్ను నేను మోసం చేసుకుంటున్నాను. మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటున్నారు. ప్రతీ మనిషికి మాట మాట్లాడేటప్పుడు గాని, చేత్తోటి చేసేటప్పుడు గాని, తలంపు వచ్చేటప్పుడు గాని, ఏది మంచో, ఏది చెడ్డో లోపల తన నిజమైన ఆత్మ చెబుతూ ఉంటుంది. ఏది జ్ఞానానికి తీసుకెళుతుందో, ఏది అజ్ఞానాన్ని పెంచుతుందో, ఏ పని చేస్తే మనసు పలుచపడుతుందో, ఏ పని చేస్తే మనసు చిక్కబడుతుందో, తనలో ఉన్న నిజమైన ఆత్మ చెబుతూనే ఉంటుంది. మన దుష్ట బుద్ధి వల్ల ఆత్మ చెప్పిన విషయాన్ని వదిలేసి మనం పనులు చేస్తున్నాము. అందుచేత ప్రకృతి మనలని పిండి పిండి, జనన మరణ చక్రం లోనుండి బయట పడనివ్వకుండా ఈ సుడిగుండంలో తిప్పి తిప్పి నరకలోకాలకి తీసుకెళ్తుంది. భగవంతుడు మనకు ఎటువంటి అవకాశం ఇచ్చాడంటే - నీలో కొన్ని చెడ్డ అలవాట్లు ఉన్నప్పటికి నా పట్ల గల విశ్వాసం విషయంలో మటుకి నీకు సందేహం లేకపోతే, గాలికి కదిలిపోయే విశ్వాసం కాదు, మాటలకి బెదిరిపోయే విశ్వాసం కాదు, ఎవడైతే భగవంతుడు అనే వాడు ఒకడు ఉన్నాడని నా పట్ల పరిపూర్ణమైన విశ్వాసంతో ఉన్నాడో, వాడిలో ఎన్ని పొరపాట్లు ఉన్నా సరే ఆ పొరపాట్లు అన్నీ కాల్చేసి వాడికి నా స్వరూపం ఇస్తాను అన్నాడు ఈశ్వరుడు. అంటే మన ఇంట్లో ఉన్న పెంట కుప్ప ఎంత పెద్దదైనా అగ్గిపుల్లకి లోకువే. గుమ్మడికాయి ఎంత పెద్దది అయినా కత్తిపీటకి లోకువే. అదే విధంగా నీలో ఎన్ని లోపాలు ఉన్నప్పటికి, ఎన్ని బలహీనతలు ఉన్నప్పటికి, నా పట్ల విశ్వాసంలో మటుకి త్రికరణశుద్ధి ఉంటే,

అది నిజమైనది అయ్యుంటే, నా పట్ల నీకున్న ప్రేమే గనుక నిజం అయితే, నీలో ఎన్ని బలహీనతలు ఉన్నప్పటికి వాటిని కాల్చి బూడిదచేసి నా స్వరూపాన్ని నీకు ఇస్తాను. వాడు కూడా యోగి తోటి సమానుడే. అటువంటి విశ్వాసాన్ని నా మీద మీరు పెంచుకోండి అన్నాడు ఈశ్వరుడు. అయితే మన విశ్వాసం చలించిపోతోంది. మనం భగవంతుని విశ్వసిద్దాము, భగవంతుని ప్రేమిద్దాము అని అనుకున్నప్పటికి మనకున్న అలవాట్లు ఆ విశ్వాసాన్ని సరిగ్గా ఉండనిస్తాయా? భగవంతుని పట్ల విశ్వాసంగా ఉందాము అనుకున్నప్పటికి మన అలవాట్లు ఉండనివ్వవు. కాని భగవంతుడి కోసం అలవాట్లని కూడా మనం జయించి, మన అలవాట్లని విడిచిపెట్టేసి, వాటిని బలి ఇచ్చెయ్యాలి.

భార్యాభర్తలు ఒకొళ్ళంటే ఒకరికి పడకపోయినా రాజీ పడతారు కానీ భగవంతుడి తోటి రాజీ పడే భక్తుడు ఎవరు ఉన్నారు. భార్య అంటే మనసులో ఇష్టం లేకపోయినా భర్త రాజీ పడతాడు. లేకపోతే సంసారం గడవదు. భర్త అంటే భార్యకి ఇష్టం లేకపోయినా రాజీ పడుతుంది ఎందుకంటే సంసారం గడవదు అని తెలుసు. ఈ స్త్రీలంతా భర్తలని ప్రేమిస్తున్నారా? ఈ భర్తలు అంతా స్త్రీలను ప్రేమిస్తున్నారా? ఎన్ని అభిప్రాయ భేధాలతోటి ఇళ్ళల్లో జీవిస్తున్నారు! అంటే నా సుఖం కోసం, ఇంట్లో అభిప్రాయ భేదాలను కూడా అణచి రాజీ పడుతున్నాను. భగవంతుడి తోటి రాజీ పడుతున్నానా? అంటే నా అభిప్రాయాలకి విరుద్ధంగా ఇంట్లో అభిప్రాయాలు ఉన్నప్పటికి నా అభిప్రాయాలను బలి ఇచ్చేస్తున్నాను రాజీ పడటం కోసం. కాని భగవంతుడు చెప్పిన మాటలకి విరుద్ధమైన అలవాట్లు నాలో ఉన్నప్పటికి భగవంతుడి కోసం అలవాట్లని బలి ఇవ్వలేకపోతున్నాను. భగవంతుడి దగ్గర రాజీ పడలేకపోతున్నాను. అంటే నా దేహ సుఖం కోసం నేను బలి ఇచ్చే విషయాలను కూడా నా అహంకారాన్ని పోగొట్టుకోవడానికి నేను బలి ఇవ్వలేకపోతున్నాను. అందుకే ఈ చక్రంలోంచి బయట పడలేకపోతున్నాను. మీ ఇంట్లో ఎవరికీ అభిప్రాయ బేధాలు లేవా? భగవంతుడి కోసం నేను నా అలవాట్లని వదిలిపెట్టలేనా? రాజీ పడలేనా? నేను ఈ కో-ఎగ్జిస్టెన్స్ (సహజీవనం) ఇంట్లో చేసినపుడు, భగవంతుడితో ఎందుకు చెయ్యలేకపోతున్నాను? కో-ఎగ్జిస్టెన్స్ కోసం నా యొక్క వాంఛలని నేను అణుచుకుంటున్నాను కదా, అదే విధంగా నా అలవాట్లని ఎందుకు విడిచిపెట్టకూడదు ఈశ్వరుడి కోసం?

భగవంతుడు ఏ గుణాలు అయితే మనలని విడిచి పెట్టమని చెబుతున్నాడో, ఆ గుణాలని మీరు త్యాగం చెయ్యగలిగితే అనంతమైన ఫలితాన్ని మీకు ఇవ్వటానికి సిద్దంగా ఉన్నాడు. లోపల ఆత్మే శాశ్వతంగా ఉండేది, మోక్ష సుఖాన్ని ఇచ్చేది. ఒకరోజు ఉండి, ఇంకోరోజున మారిపోయేది కాదు. మిమ్మల్ని పరమాత్మ తన ఒడిలోకి తీసుకోవటానికి సిద్దంగా ఉన్నాడు. మనుషులతోటి రాజీ పడే మనం, ఈశ్వరుడితోటి రాజీ పడలేకపోతున్నాము. మన అలవాట్లు మనం విడిచి పెట్టుకోడానికి ఇష్టం లేకపోయినా, భగవంతుడి కోసం అయినా విడిచిపెట్టండి. భగవంతుడు చెప్పిన మాటలు మనం గౌరవించలేకపోతే ఏమీ త్యాగం చేయలేము. ఏ విషయాలైతే మన మనసుని చలింపచేస్తున్నాయో, ఏ విషయాలైతే మన అజ్ఞానాన్ని పెంచుతున్నాయో, ఏ విషయాలైతే మన ఇంద్రియాలని చలింపచేస్తున్నాయో, ఆ విషయాలని

మనం త్యాగం చెయ్యటం లేదు. మీరు నిప్పులో నెయ్యి వేయటం యజ్ఞం కాదు. భగవంతుడి కోసం తనలో ఉన్న విషయాలని త్యాగం చెయ్యగలిగినవాడు నిజమైన యజ్ఞం చేసినవాడు, నిజమైన నోములు నోచిన వాడు. పోనీ మీకు ఇష్టం లేకపోతే ఈశ్వరుడి కోసం చెయ్యండి. మిమ్మల్ని ఏమైనా బరువు మోయమంటున్నానా? ఈశ్వరుడు చెప్పిన మాట నమ్మమనే కదా అంటోంది. అంతకంటే ఏమైనా పెద్ద మాటలు అంటున్నానా?

ఏమీ అక్కర్లేదండి, ఈ యోగాభ్యాసాలు, సాధనలు అన్నీ మూట కట్టి పక్కన పెట్టండి. మిమ్మల్ని మీరు వంచన చేసుకోకండి, ఈ సెకనులో మీరు జ్ఞానులు అవుతారు. మీరు ఏమీ సాధనలు చెయ్యొద్దు, యోగాభ్యాసాలు చెయ్యొద్దు, ప్రాణాయామాలు చెయ్యొద్దు, ముక్కులు మూసుకోవద్దు ఏమీ చెయ్యొద్దు. మిమ్మల్ని మీరు వంచన చేసుకోవడం మానేయండి, ఈ సెకనులోనే మీరు అందరూ జ్ఞానులు అవుతారు. 24 గంటలు ఎవడికి వాడు తనని తాను వంచన చేసుకుంటూ ఈ లోకంలో జీవిస్తున్నాడు. అంతే మన జీవితం! లైఫ్ ఇజ్ ఎండ్లెస్. మీ శరీరానికి యాభై యేళ్ళు, డభ్భై యేళ్ళు ఉండచ్చు అంత మాత్రాన మీ జీవితం పూర్ణం అయ్యిపోయింది అనుకోవద్దు. ఇంకో శరీరంలో అది కంటిన్యూ అవుతుంది. మీ శరీరానికి ముగింపు ఉంది, మీ జీవితానికి ముగింపు లేదు సత్యాన్ని తెలుసుకునేవరకు. మీ శరీరానికి ముగింపు ఉంది కాని మీ శరీరంలో ఉన్న జీవితానికి మట్టుకు ముగింపు లేదు. ప్రకృతి విరుద్ధంగా నడిస్తే ఏనాటికైనా మనం ప్రకృతికి సమాధానం చెప్పాలి.

ఆచార్యుల వారు కుటిలులు తోటి, లౌకికులు తోటి స్నేహాలు చెయ్యొద్దు అని చెపుతున్నారు. మీరు పెద్ద పెద్ద సాధనలు చెయ్యలేకపోవచ్చు. కుటిలుల తోటి, లౌకికుల తోటి స్నేహాలు చేయకుండా ఉండలేరా అంటే ఉండలేరు - ఎందుచేతంటే మన స్వార్ధానికి వాళ్ళు ఉపయోగపడవచ్చు. ప్రతి మనిషి ఈ లోకంలో తన అహంకారాన్ని సంతృప్తి పరచుకోవడం కోసం జీవిస్తాడు. భార్య కోసం భర్త అహంకారాన్ని విడిచిపెడుతున్నాడు. భర్త కోసం భార్య అహంకారాన్ని విడిచి పెడుతుంది. సంసార యాత్ర నడవడం కోసం. కానీ ఈశ్వరుడి కోసం అహంకారాన్ని విడిచి పెట్టేవారు ఎవరు ఉన్నారు? కొంతమంది వీధిలో పులిగా కనిపిస్తారు, ఇంట్లోకి వెళితే పిల్లి అయ్యిపోతారు. అలా రాజీ పడకపోతే వాడికి రోజులు వెళ్ళవు. వెనుకొక స్త్రీ చెప్పిందట ఈ ప్రపంచం అంతా కూడా నా భర్త చేతిలో ఉంటే బాగుండును అని. అంతవరకు బాగానే చెప్పింది కానీ నా భర్త ఎవరి చేతిలో ఉండాలి; దేవుడి చేతిలో కాదు నా చేతిలో ఉండాలి! చాలామంది అంటారు మేము భగవాన్ని చూడలేకపోయాము అని. కానీ నాకు అటువంటి తలంపు ఎప్పుడూ రాలేదు. భగవాన్ ఉన్నప్పటికి మనని అందరినీ ప్రేమించింది భగవాన్ శరీరమా? నేను చూడలేదు భగవాన్ని; చూడలేకపోయాము అన్న తలంపు నాకు ఎప్పుడు రాలేదు. కానీ భగవాన్ ఉన్నప్పటికీ మనని అందరినీ ప్రేమించింది ఆయన శరీరమా? ఆయన ఉన్నప్పుడుకూడా ఆయన శరీరం మనలని ప్రేమించిందా?

ముందు మీ మనసుకి, ఇంద్రియాలకి చల్లదనం కలగాలి. మీ హృదయంలో చల్లదనం లేనప్పుడు, మీ మనసులో చల్లదనం లేనప్పుడు, మీ ఇంద్రియాలలో చల్లదనం లేనప్పుడు ఈశ్వరుడి స్వరూపం మీకు తెలియదు. ఈశ్వరుడు చెప్పిన మాటలని గౌరవించాలి అనే కోరిక కూడా

నీకు కలగదు. ఈశ్వరుడు చెప్పింది మీరు వినండి. అందులో మీకు తీపి దొరకకపోతే, అందులో ఇష్టత మీకు కుదరకపోతే, నేను రోజూ చెప్పినా మీరు ఆచరించలేరు. మీకు ఇష్టత కలిగితే, మీకు రుచి తెలిస్తే, నేను ఆచరించద్దు అని చెప్పినా మీరు ఆచరిస్తారు. మీకు కూర బాగా నచ్చింది అనుకోండి, మీరు రెండు ముద్దలు ఎక్కువ తింటారు. మీకు కూర నచ్చలేదు అనుకోండి చెప్పినా మీకు వెళ్ళదు లోపలకి. మీకు విషయం అసలు అర్థం అయితే నేను ఆచరించవద్దు అని చెప్పినా కూడా మీరు ఆచరిస్తారు. విషయం మీకు అర్థం కావటం లేదు అనుకోండి, ఆచరించండి, ఆచరించండి అని నేను బుడబుక్కలవాడు చెప్పినట్టు చెప్పినా, మీరు ఆచరించరు. మీ హృదయానికి అందేటట్టు చెప్పకపోతే అది కూడా నాదే దోషం!

Calmness must be maintained at all times, at all places! మీరు జీవితంలో ఎటువంటి పరిస్థితులు మీకు ఎదురైనప్పటికి వేడెక్కకుండా ఉండాలి. మీ హృదయాన్ని చల్లగా ఉంచుకోవాలి, మనసుని చల్లగా ఉంచుకోవాలి. తొందరపాటు, కంగారుపాటు పనికిరాదు. అన్ని దానాలలోకి నిదానం గొప్పది అన్నారు. అంచేత నిదానంగా జీవించాలి. మీరు ఏ దేవుడిని ప్రార్థిస్తున్నారు, ఏ గురువుని ఆశ్రయించారు అని కాదు ఇక్కడ సమస్య. మిమ్మల్ని అందరినీ బానిసలని చేయాలని నాకు ఏమీ లేదు. మీరు బాగుపడటం ముఖ్యం. మీరు ఏ నామరూపాన్ని ఆరాధించినా సరే, మీరు దుఃఖానికి దూరం అవ్వటం ఒక్కటే నాకు కావలసింది. తన తలంపే తన స్వాధీనంలో లేని వాడు, తన మనస్సే తన స్వాధీనంలో లేని వాడు, ఇక లోకాన్ని ఏమి ఉద్ధరిస్తాడు? అదే రమణస్వామి చెప్పేవారు తినటానికి మెతుకులు లేనప్పుడు అన్నసత్రం పెడతానంటే ఎలా కుదురుతుంది. వాడికి తినడానికి అన్నం లేదు కానీ అన్నసత్రం పెట్టి పదిమందికి అన్నం పెడతాను అనేవాడట వాడు. నా హృదయాన్ని నేను చల్లబరచుకోలేకపోతే, నా ఇంద్రియాలని నేను చల్లబరచుకోలేకపోతే, నా తలంపులను నేను స్వాధీనం చేసుకోలేకపోతే లోకానికి నేను చేసేది ఏమిటి? అందుచేత అంతఃకరణం శుద్ధి చేసుకోవాలి. అంతఃకరణం అంటే లోపల ఉన్న పనిముట్టు. లోపల మనసు ఉంది, దానిని శుద్ధి చేసుకోవాలి. లోపల ఉన్న పనిముట్టుని చల్లబరచుకుంటే, మనం బాగు చేసుకుంటే అది మనకి జ్ఞానానికి దారి చూపిస్తుంది. దేహాన్ని శుద్ధి చేసుకుంటున్నాము. అలాగే అంతఃకరణాన్ని ఎందుకు శుద్ధి చేసుకోవాలి అంటే, అది జ్ఞానానికి దారి చూపిస్తుంది.

హృదయశుద్ధి గలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరు. ఈశ్వరుడి కోసమే మీరు విలపిస్తుంటే, ఈశ్వరుడి కోసమే మీకు దుఃఖం వస్తుంటే, ఆ కన్నీళ్ళన్నీ వేస్టు అవుతాయి అని మీరు అనుకోకండి. అడవిలో కాసిన వెన్నెల లాగా ఆ కన్నీళ్ళన్నీ ఎందుకూ పనికి రాకుండా పోతాయి అని మీరు అనుకోకండి. మీరు ఈశ్వరుడి కోసం ఎంత కన్నీళ్లు కార్చారో, మీ హృదయంలో ఉండి చూస్తూ ఉంటాడు. వాళ్ళు ఓదార్చబడుదురు! ఈశ్వరుడి కోసం కన్నీళ్లు కార్చటం మానేసి, నిరంతరం లోకంలోని వస్తువుల కోసం, ఈ లోకం కోసమే నిరంతరం ఏడ్చేవాళ్ళని చూసి, పరలోకంలోకి వచ్చినప్పుడు మీరు ఎవరో నాకు తెలియదు, బయటకి పొండి అంటానన్నాడు ఏసు.


ఇంట్లో ఎన్నో సందర్భాల్లో మనం ఏడుస్తున్నాము. అల్లుడికి కోపం వస్తే ఏడుస్తున్నాము

కదా, రోగమొస్తే ఏడుస్తున్నాము. ఎన్ని సార్లు ఏడ్చామో ఈ జీవితంలో, ఎంతవరకు ఏడ్చామో, ఇంకా ఎన్నాళ్లు ఏడుస్తామో! ఇంతకాలం మనం ఏడ్చామే, ఈశ్వరుని కోసం కనీసం ఎప్పుడైనా ఒక కన్నీటి బొట్టు రాల్చామా? ఇప్పటిదాకా మనం లెక్కేసుకుంటే, కొలిస్తే బిందెడు నీళ్ళు మనం లోకం కోసం, స్నేహితుల కోసం, బంధువుల కోసం, మన ప్రయోజనాల కోసం, మన స్వార్థం కోసం ఏడ్చాము అనుకోండి. ఈ బిందెడు నీళ్ళలో ఈశ్వరుడి కోసం ఏడ్చింది ఒక కన్నీటి బొట్టు ఉందా? ఒక బొట్టు ఒక డ్రాప్! ఈ అంతఃకరణం దయ అనేది ఎప్పుడైనా చూసిందా? ఇవి బండ రాళ్ళు! దయగల అంతఃకరణమా ఇది? దయ ముఖం ఈ అంతఃకరణం ఎప్పుడైనా చూసిందా? కంపాషన్ అంటే ఏమిటో, మెర్సీ అంటే ఏమిటో, ఈ అంతఃకరణానికి తెలుసా! కొంతమంది ఇంట్లో ఉన్న మనుషులని కూడా ప్రేమించరు, వాళ్ళ దేహాన్నే ప్రేమించుకుంటారు. ఇదొరకమైన స్వార్థం. ఊరిని ప్రేమించవద్దు, దేశాన్ని ప్రేమించవద్దు. విశ్వాన్ని ప్రేమించవద్దు. ఇంట్లో ఉన్న మనుషులని కూడా ప్రేమించడు. వాడి దేహాన్నే వాడు ప్రేమించుకుంటాడు. వాడికా జ్ఞానం!

మనం ఈ భూమి మీద నడిచేటప్పుడు చివరి రోజు ఏదొకటి వస్తుంది కదా ఈ జీవిత యాత్రకి! ఈ భూమి మీద యాత్రకి వచ్చాము. కొంతమంది పెద్దలు యాత్రకి వెళ్ళినపుడు ఏమి చెబుతారంటే, ఏది పడితే అది తినకండి ఆరోగ్యం చెడిపోతుంది. మీరు జాగ్రత్తగా తిని, జాగ్రత్తగా ఉంటే, వెళ్ళిన వాళ్ళు వెళ్ళినట్టుగా ఇంటికి తిరిగి వస్తారు అని చెప్తారు. అదే విధంగా మనం ఈ భూమి మీద యాత్రకి వచ్చాము ఇది మన ఇల్లు కాదు. మన నిజమైన ఇల్లు మన ఆత్మ. ఆ ఇంటికి మనం చేరుకునేవరకూ, జాగ్రత్తగా చివరి రోజు వరకు, చివరి శ్వాస పీల్చుకునేవరకూ వరకు ఎవరైతే జాగ్రత్తగా ఉంటారో, వారికి జ్ఞానం వస్తుంది. వారం రోజులు అయితే, మేము జాగ్రత్తగా ఉంటాము తరువాత సంగతి మేము చెప్పలేము అంటారు. మేము ఆషాడమాసం వరకూ జాగ్రత్తగా ఉంటామండి తరువాత మేము చెప్పలేము అంటే, అలా కుదరదు. చివరిరోజు వరకూ ఎవరైతే బహుజాగ్రత్తగా ఉంటున్నారో, కత్తి మీద నడిచేవాడు కాలు తెగిపోతుందేమో అని ఎంత జాగ్రత్తగా నడుస్తాడో అలా చివరిరోజు వరకూ చివరిశ్వాస వరకు ఎవరైతే జాగ్రత్తగా ఉంటాడో వాడికి జ్ఞానం వస్తుంది.

మీ కళ్ళకి కనిపిస్తున్న సూర్యుడి కంటే గొప్పది మీ లోపల ఉన్న వస్తువు. యధార్థం చెప్పాలంటే ఈ సూర్యుడు కూడా జడవస్తువే, మీలో ఉన్న ఆత్మ మట్టుకు జడవస్తువు కాదు, అది యధార్థం, చైతన్యం. మనం రోజూ సూర్య నమస్కారాలు చేస్తున్నాము సూర్యుడు దేవుడు అనుకుంటున్నాము. ఆ సూర్యుడు కూడా జడవస్తువే. మీలో ఉన్న ఆత్మే నిజమైన చైతన్యం, అది ఒకటే నిజం. ఆ సూర్యుడిని ప్రకాశింప చేసేది కూడా అందులో ఉండే ఆత్మే. అటువంటి గొప్ప వస్తువుని తెలుసుకోవటం కోసం సత్య వస్తువుని తెలుసుకోవడం కోసం. యధార్థంగా ప్రకాశిస్తున్న వస్తువుని తెలుసుకోవడం కోసం మనం చిన్న అహంకారాన్ని బలిచేయలేమా? ఈ అహంకారాన్ని త్యాగం చేయలేమా? ఈ అహంకారం అనే మూతని తియ్యలేమా? ఏమంటారు!

**ఓం శాంతిః శాంతిః శాంతిః !**



# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

**ఏటికీ నిదుర నన్నితరులు లాగగ**
**యిది నీకు న్యాయమా అరుణాచలా!**

తాత్పర్యం: ఇంద్రియాలు అనే తుంటరులు నన్ను బయటికి లాగి పతనము చేస్తుంటే, నన్ను రక్షించగల శక్తి నీకుండి కూడా నీవు నిదురపోతున్నావే, ఇది నీకు న్యాయమా అరుణాచలా!

ఒక ఇంట్లోకి దొంగలు వచ్చారు అనుకోండి మాటవరసకి, ఆ యజమానురాలు లేచి దొంగలు దొంగలు అంటూ ఉంటుంది. ఆ భర్త అలా మంచానికి సరిపడి నిద్రపోతున్నాడు అనుకోండి లేవడు అనుకోండి; అప్పుడు భార్య అలా మొద్దులా పడుకున్నావు ఏమిటి, దొంగలు పట్టుకుపోతున్నారు దొంగలు దోచేస్తున్నారు నువ్వు అలా పడుకుంటావేమిటి లేవవేమిటి అని మొగుడిని తిడుతుంది. ఇక్కడ రమణస్వామి అరుణాచలేశ్వరుడితో నువ్వు ఏమిటి అలా నిద్రపోతున్నావు, ఈ ఇంద్రియాలు అనే దొంగలు నన్ను లాక్కుపోతున్నాయి, నన్ను పతనం చేసేస్తున్నాయి. ఈ ఇంద్రియాలని నేను జయించలేకపోతున్నాను. ఈ ఇంద్రియాలు నన్ను సుఖపడనివ్వటం లేదు. ఒక ఇంద్రియం కూడా నేను చెప్పినట్టు వినటం లేదు. పైగా నాకు కష్టాలు తీసుకొస్తున్నాయి. నాకు బాధలు తీసుకొస్తున్నాయి. ఈ ఇంద్రియాలు నన్ను పతనం చేస్తున్నాయి. ఈ పతనం ఎక్కడ అంతం అవుతుందో నాకు తెలియటం లేదు. ఓ అరుణాచలేశ్వరుడా నిన్ను నమ్ముకొని ఇక్కడికి వచ్చాను. నువ్వు ఏమీ ఎరగనట్టు నీకు ఏమీ తెలియనట్టు అలా మొద్దుగా నిద్రపోతుంటే నన్ను ఎవరు రక్షిస్తారు అయ్యా! నిన్ను నమ్ముకొని ఇక్కడికి వచ్చాను, నువ్వే సర్వస్వం అనుకొని ఇక్కడికి వచ్చాను. నిన్ను శరణాగతి చేసాను. నువ్వు ఏమీ తెలియనట్టు నిద్రపోతున్నావు.

ఓ అరుణాచలేశ్వరుడా ఇది నీకు న్యాయంగా ఉందా! ఇది నీకు సహేతుకమా, ఇది నీకు ధర్మమా! అలా నిద్రపోవటం ధర్మమా. నిన్ను నమ్ముకొని వచ్చాను కదా. నన్ను రక్షించవలసిన భాద్యత నీకు లేదా. ఏమి నిష్టూరమైన మాటలు మాట్లాడుతున్నాడో చూడండి రమణస్వామి!



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

**కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసాం।**
**అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనాం॥ (5-26)**

కామక్రోధ రహితులును, చిత్తవృత్తులను జయించిన వారును అయి, పరబ్రహ్మ పరమాత్మ సాక్షాత్కారమును పొందిన జ్ఞానులకు అంతటను శాంత పరబ్రహ్మ పరమాత్మయే గోచరించును.

కామక్రోధములు లేని వారు, మనోనిగ్రహము కలవారును, ఆత్మతత్వము తెలిసిన వారునగు ప్రయత్నశీలురకు మోక్షము ఎల్లప్పుడు భాసించుచుండును.

కామక్రోధవియుక్తానాం - కామక్రోధాలు అన్నా రాగద్వేషాలు అన్నా ఒక్కటే. ఎక్కడైతే కామం ఉంటుందో అక్కడ రాగం ఉంటుంది. ఎక్కడైతే కోపం ఉంటుందో అక్కడ ద్వేషం ఉంటుంది. మీరు ప్రపంచంలో ఏ దేశం వెళ్లి చూసినా, ఏ ప్రాంతం వెళ్లి చూసినా, ఎవరింటికి వెళ్లి చూసినా రాగద్వేషాలు తప్పించి ఏముంది ఈ సృష్టిలో చూడటానికి అన్నాడు బుద్ధుడు. కామక్రోధాల యొక్క వేగం తట్టుకోవటం కష్టం.

మానవుడికి పొరపాట్లు చేయటం ఇష్టం లేకపోయినా, పొరపాటు చేయటానికి కారణం కామక్రోధాలు అని భగవంతుడు చెప్పాడు. కామక్రోధాలు ఉన్నంత సేపు నువ్వు మంచిగా ఉండాలన్నా ఉండలేవు. జ్ఞానాన్ని నిరోధించే పనులు కూడా నువ్వు చేస్తూ ఉంటావు. ఒకసారి పరమాచార్యులు వారిని దుర్వాసమహర్షికి కోపం ఎక్కువ కదా అని ఒకరు అడిగారు. ఆయనకి కోపం ఎక్కువ అని నువ్వు అంటున్నావు, ఆయనకి ఎక్కడా కోరిక లేదు, అది చెప్పటం మానేసి ఇది చెపుతున్నావేంటి అన్నారు. అంటే మన బుద్ధి

శుభ్రంగా పాడైపోయి ఉంది. మనం ఎదుటివారిలో ఉన్న చెడ్డ తీసుకుంటాం, వారిలో ఉన్న మంచిని వదిలేస్తాము. అలా కాదు, మనం ఎదుటివారిలో మంచిని స్వీకరించి, చెడ్డని వదిలివేస్తూ ఉండాలి, ఇది మన జీవితంలో ముఖ్యంగా నేర్చుకోవాలి.

మన శరీరం మరణించేలోపు కామక్రోధాలలోంచి విడుదల పొందాలి. మీకు కోరిక వచ్చిందనుకోండి, అది ఒక ఉద్రేకం. మీకు కోపం వచ్చిందనుకోండి, అది ఒక ఉద్రేకం. మీకు కోరిక కోపం వచ్చినప్పుడు, మీ శరీరము మనస్సు కూడా ఉద్రేకపడతాయి. రాగద్వేషాలు ఉన్న వాడి మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. కామక్రోధాలలో నుంచి మీరు విడుదల పొందకుండా స్వరూపసుఖాన్ని పొందలేరు. సాధన చేసి, సాధన చేసి, రాగద్వేషాలని అతిక్రమించిన వాడు కాని హృదయగుహలో పడలేడు, అంటే స్వరూపసుఖం పొందలేడు. ఏ సాధకుడు అయితే కామక్రోధాలలోనుంచి విడుదల పొంది, ఆత్మయొక్క వైభవాన్ని అనుభవం లోనికి తెచ్చుకున్నాడో, వాడికి శరీరం ఉంటే ఆనందం, శరీరం పోతే ఆనందం, లోకం కనిపిస్తే ఆనందం, లోకం కనపడకపోతే ఆనందం. వాడికి అదృష్టం వెంటాడుతూ ఉంటే ఆనందం, దురదృష్టం వెంటాడుతూ ఉంటే ఆనందం. ఎటుచూసినా ఆనందమే, ఎటు చూసినా సుఖమే, ఎటుచూసినా శాంతే. అది ఆత్మ యొక్క వైభవం.

స్వరూపసుఖం అంటే నూటికినూరు పాళ్ళు మీరు హ్యాపీగా ఉంటారు. మీ డబ్బులను బట్టి, మీ పాండిత్యాన్ని బట్టి, మీ కుటుంబ పరిస్థితులను బట్టి ఆ happiness రాదు. మీ కుటుంబ పరిస్థితులు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు. మీ ఇంట్లో వాళ్ళు అందరూ మీకు శత్రువులు అవ్వవచ్చు. కాని ఈ కామక్రోధాలలోనుంచి విడుదల పొందినవాడు, నూటికినూరు పాళ్ళు అలౌకికమైన అభౌతికమైన స్వతంత్రమైన సుఖం, ముగింపు లేని శాంతి పొందుతాడు. మీరు కనీసం మీ ముక్కులో గాలి బయటికి పోయే టైముకి అయినా ఆత్మ సుఖాన్ని మీరు ఎక్స్‌పీరియన్స్ చేస్తే, మీకు పునర్జన్మ లేదు, మీరు శవాలను మోయనక్కరలేదు అని గౌతమ బుద్ధుడు స్పెసిఫిక్ గా అనుభవం మీద చెప్పాడు.

యతీనాం యతచేతసాం - అంటే మనస్సు స్వాధీనమునందు ఉండుట. అజ్ఞానంలోంచి విడుదల పొందటానికి ఎవరైతే ప్రయత్నం చేస్తున్నారో, ఎవరైతే తమని తాము స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారో వారు శరీరం బతికి ఉండటం తోటి, శరీరం చనిపోవటం తోటి సంబంధం లేకుండా అమృతత్వం పొందుతారు. మృత్యువు అంటే చనిపోవటం, అమృతత్వం అంటే మృత్యువుని జయించిన వాళ్ళని అమృతత్వం పొందారు అంటారు. మరణం అంటే కంగారు పడకండి. మరణం అంటే ఏమీ లేదు. ఈ శరీరం పనికిరాదు అని భగవంతుడు అనుకున్నప్పుడు శరీరాన్ని మారుస్తాడు. మరణం మనకి మంచిదే. ఒకో శరీరంలో మనం ఎంత ప్రయత్నం చేసినా ఎక్కువ సాధన చేయలేము.

కాని సాధన చెయ్యాలనే కుతూహలం ఉంటుంది. ఆ కుటుంబ పరిస్థితులను బట్టి, ఆ పరిసరాలను బట్టి సాధన ముందుకి వెళ్లదు. వాడు ఎంత కష్టపడ్డా అభివృద్ధిలోకి రాలేడు. అటువంటప్పుడు ఆధ్యాత్మిక అభివృద్ధి రావటానికి దేహాన్ని మార్చేస్తాడు. అప్పుడు కుటుంబం మారిపోతుంది, పరిసరాలు మారిపోతాయి, ఊరు మారిపోతుంది. అప్పుడు వాడికి మంచిదే కాని చెడ్డ కాదు. కాని అది మనకి తెలియకపోవటం వలన కంగారు వచ్చేస్తుంది. అది భగవంతుడి గ్రేస్. భగవంతుడు మీకు ఏదైనా ఉపకారం చేస్తే దేవుని దయ వలన ఇలా ఉన్నాము అనుకుంటున్నారు. అలాగే చావు వచ్చినా దేవుని దయ అనుకోండి. ఆయన దయ లేకపోతే శరీరం మార్చడు. మీ మీద కోపం మీద కాదు. మీకు ఆధ్యాత్మిక పురోభివృద్ధి కలగటం కోసం అలా చేస్తాడు. అనేక జన్మలు సత్కర్మ నిష్కామంగా చేస్తేనే కాని, అనేక జన్మల పుణ్యబలం ఉంటేనే కాని, ఆ జన్మకాజన్మ పవిత్రుడు అయితేనే కాని, వాడు ఆత్మజ్ఞానానికి అర్హుడు కాదు.

అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనాం - అంటే అమృతత్వం పొందిన వాళ్లకి, బ్రహ్మానుభవం పొందిన వాళ్లకి, శరీరం చనిపోనక్కరలేదు. మీ శరీరం ఈ భూమి మీద తిరుగుతున్నప్పుడే మీరు బ్రాహ్మీసుఖం పొందుతారు. రమణమహర్షి, రామకృష్ణపరమహంస మన లాంటి మనుషులే. సాధన చేసి, సాధన చేసి, కష్టపడి, కష్టపడి, ఆ దైవత్వం పొందారు. మీరు కూడా ప్రయత్నం చేసి పొందండి. ఆత్మజ్ఞానానికి అందరూ వారసులే. వాళ్ల హృదయంలో ఉన్నదే మీ హృదయంలో ఉంది. వాళ్ళు తెలుసుకున్నారు, మనం తెలుసుకోలేక పోతున్నాము. వాళ్ళు ఎంత కష్టపడి ప్రయత్నం చేసారో, మనం కూడా అంత కష్టపడి సాధన చేస్తే మనం తెలుసుకుంటాము. నమ్మిన వాడిది సొమ్ము, నమ్మని వాడిది దుమ్ము!

మీ శరీరం ఉండగానే, బ్రాహ్మీస్థితి పొందితే మంచిదే కాని, ఇప్పుడు ఆ స్థితి లేకపోతే మీ శరీరం చనిపోయే రోజుకైనా ఆ స్థితిని పొందాలి. అంటే నూటికి నూరుపాళ్ళు దేహంతోటి సంబంధం లేకుండా, లోకంతోటి సంబంధం లేకుండా, నామరూపాల తోటి సంబంధం లేకుండా, అదృష్టాలు దురదృష్టాల తోటి సంబంధం లేకుండా, కర్మ ఫలితాల తోటి సంబంధం లేకుండా, ఎవడైతే శాంతిలో కూరుకుపోయాడో, వాడు ఆ లోకానికి, ఈ లోకానికి ప్రయాణం చేయవలసిన అవసరం లేదు. వాళ్లకి గోయింగ్ ఆగిపోతుంది, కమింగ్ ఆగిపోతుంది.

**మీ ఇంద్రియాలు కనుక మీ స్వాధీనంలో ఉంటే లోకం మిమ్మల్ని ఏమీ చెయ్యలేదు. అసలు మన శత్రువులు ఎవరో బయట ఉన్నారు అనుకొంటున్నాము. మన ఇంద్రియాలే మన శత్రువులు. మన ఇంద్రియాలతోటి లోకంలోని విషయాలని అనుభవించటం కోసం, మన ఇంద్రియాలు మనల్ని మోహంలో పెడుతున్నాయి కాని లోకం ఎప్పుడూ నన్ను మోహించు అని మనలను అడగలేదు.**

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

మార్చి 13 సద్గురు శ్రీ నాన్నగారి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ అరుణగారి ప్రవచనము

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174**

**For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502**

**ది॥ 13-03-2020 శుక్రవారం**

## సద్గురు శ్రీ నాన్నగారి

# విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

**శ్రీరమణక్షేత్రం, జిన్నూరు**

ఉ॥ గం॥ 6-00ల నుండి గం॥ 10-00ల వరకు పూజాకార్యక్రమములు

7-00లకు అల్పాహారం

11-00లకు అన్నప్రసాదం

మ॥గం॥ 1-00లకు హైదరాబాద్ అరుణగారి ప్రవచనము

**భక్తులందరికీ ఆత్మీయ ఆహ్వానము**

# విషయాన్ని అర్థం చేసుకోవటం ద్వారానే ముక్తి లభిస్తుంది

ప్రాపంచిక సుఖభోగాల పట్ల విముఖత ఏర్పడితే తప్ప ఆధ్యాత్మిక వికాశం కలుగదు. ఈ శరీరం పంచతత్వముల మూట ఇది నశించిపోయేది అని నిరంతరం గ్రహించాలి. మనం దేహాభిమూలంగానే బద్ధులైపోతున్నాము. 'నేను' అనే పదానికి ఎవరికి జాడలేదో వారు నిర్వాణస్థితిని పొందుతారు. చెరుకుగడను నమిలి రసమును మింగి పిప్పిని పారవేస్తాము. అలాగే ఆత్మనుగ్రహించి శరీర ధ్యాస వదిలివేయాలి. బ్రహ్మం నిర్గుణం, నిరాకారం. మాయ సుగుణము, సాకారము. బ్రహ్మం కనిపించదు, మాయ కనిపిస్తుంది. బ్రహ్మ ఎన్నటికీ నశించదు, నిర్మితం కాదు. మాయ నిర్మితం. అజ్ఞానమునకు మాయ రుచిగా ఉంటుంది, తెగిపోతుంది; బ్రహ్మం తెగిపోదు. మాయ మలినము అగును, బ్రహ్మం మలినము కాదు. అది అంతులేనిది. మాయ సార రహితము. బ్రహ్మము సారవంతమని సాధకుడు విడదీసుకొని ఉన్నతమైన బ్రహ్మాన్ని ఎన్నుకోవాలి. మనం ఎంత శాంతంగా ఉంటామో గురువుకు మనం అంత అందుబాటులో ఉంటాము, దగ్గర అవుతాము. అదే మార్గము భోజనం చేస్తూ ఉంటే మన దృష్టి భోజనం మీదే ఉండాలి. అలాగే స్నానం చేస్తున్నప్పుడు మరో ఆలోచన రాకూడదు. అలాగే పూజ చేసుకొంటూ ఉంటే మన దృష్టి అంతా పూజ మీదే ఉండాలి. శరీరం ఏ పనిలో ఉంటే అదే ఆలోచనలో ఉండాలి. ఎవరైనా మనలను అవమానించినప్పుడు ఒక లోతైన గాయాన్ని అనుభవించే అవకాశాన్ని మనకు అందించిన వ్యక్తి పట్ల కృతజ్ఞత ఉండాలి. అవమానానికి ఆ వ్యక్తి ఆద్యుడు కారణం కాకపోవచ్చుకాని ఆవేదనా ప్రక్రియలో ప్రస్తుతం చురుకుగా సాగుతున్నందుకు ఆ వ్యక్తి దోహదం చేసాడు అంతే. పాపి ఉనికి వల్లనే పవిత్రాత్మకుడి ఉనికి ఉంటుంది. అందుచేతనే పాపిని ద్వేషించవద్దు అని బుద్ధుడు బోధిస్తాడు. ఇది నాణానికి ఉన్న రెండు ముఖాలు అవి. ఆత్మకోసం మనం అన్ని ప్రయత్నాలు శ్రద్ధగా చెయ్యాలి. అవి అన్ని విఫలమైన తరువాత నిరాశతో, భక్తి ఆవేశంతో రోదిస్తే పరమానందం గురు దయ వల్ల వస్తుంది. దీనికి క్రమశిక్షణ, కఠోర దీక్షల అభ్యాసం తరువాత వస్తుంది. కర్మలు పూర్తి కాగానే దైవకృప ప్రసరించటమౌతుంది. పరదూషణ నిజంగా ఆత్మదూషణమే. శ్రీనాన్నగారు "ఎదుటవారి బుర్రతో, మెదడుతో మిమ్ములను మీరు చూచుకొంటారా? మీకు మెదడు లేదా? భగవంతుడు మనం చేసే చిన్న తలంపునూ సాక్షిగా చూస్తున్నాడు" అన్నారు. భగవంతుణ్ణి ప్రేమించాలి. అందరిలోనూ భగవంతుడు ఉన్నాడనే దృక్పథంతో అందరినీ ప్రేమించాలి. ఈ సృష్టిని అంతా ప్రేమించలేకపోతే, కనీసం నీ పరిధిలో ఎవ్వరినీ ద్వేషించకు. భగవంతుడే సత్యమనే ఎరుకతో మనం నిరంతరం ఉంటూ సాధారణమైన జీవితంతో జీవించాలి. తద్వారా ఆధ్యాత్మిక పురోభివృద్ధి కలుగుతుంది. అంతే తప్ప అవగాహనలేక దానితో కూడిన తెగింపు లేకపోతే మన సాధనకు ఉపక్రమిస్తే ఉభయ భ్రష్టత్వమే సిద్ధిస్తుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**